సోమవారం
01-04-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 280
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పాక్‌లో వర్షబీభత్సం-10 మంది మృతి

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లోని వర్షం బీభత్సం సృష్టించింది. ఖైబర్ ఫక్‌తుంఖ్వా ప్రావిన్స్‌లో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో ఇప్పటికే పది మంది మృత్యువాత పడ్డారు. మరో 12 మందికి గాయాలయ్యాయి. ఈ మేరకు ఆదివారం అధికారిక ప్రకటన వెలువడింది. మృతుల్లో ఎనిమిది మంది పిల్లలు, ఇద్దరు మహిళలు ఉండగా గాయపడిన వారిలో తొమ్మిది మంది పిల్లలు, ఇద్దరు మహిళలు ఉన్నారని తెలిపింది. 27 ఇళ్లు ధ్వంసమయ్యాయని వెల్లడించింది. ముంపు ప్రాంతాల్లో రెస్క్యూ బృందాలు సహాయక చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. గాయపడిన వారిని ఆసుపత్రులకు చేర్చుతూ, నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తూ, అవసరమైన సహాయాన్ని అందిస్తున్నట్లు పీఎండీఏ వెల్లడించింది.

ఇండియా కూటమితోనే ప్రజాస్వామ్యానికి రక్ష

- బీజేపీ నియంతృత్వాన్ని ఓడిస్తేనే దేశాభివృద్ధి
- 'లోకతంత్ర బచావో' ర్యాలీలో విపక్ష నేతల ఉద్ఘాటన
- 24 గంటల విద్యుత్- రైతులకు మద్దతు ధర
- ప్రతి ఒక్కరికి ఉత్తమ విద్య, ఆరోగ్యం
- పూర్తిస్థాయి రాష్ట్రంగా ఢిల్లీ
- ఆరు హామీలు ఇచ్చిన కూటమి
- ఈసీకి ఐదు డిమాండ్లు

న్యూఢిల్లీ: ఇండియా కూటమితోనే ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి రక్ష, నిరంకుశ బీజేపీని, నియంతృత్వ మోదీని గద్దె దించుదాం అని 'లోకతంత్ర బచావో ర్యాలీ'లో ప్రతిపక్ష నాయకులు పిలుపునిచ్చారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను అస్త్రాలుగా మల్చుకొని విపక్షాలపై చేస్తున్న దాడులను తక్షణమే ఆపాలని, ఎన్నికల్లో అన్ని పార్టీలకు సమాన అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. నియంతృత్వం నుంచి విముక్తి కోసం ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు. భారత్‌కు ఆరు హామీలు ఇచ్చారు. అధికారంలోకి వస్తే ఢిల్లీకి పూర్తి రాష్ట్ర హోదా కల్పిస్తాం, దేశమంతటా 24 గంటల విద్యుత్ అందిస్తాం, పేదలందరికీ ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం, ప్రతి గ్రామంలో ప్రభుత్వ బడులను అద్భుతంగా నిర్మిస్తామని, ఊరు-వాడలో మొహల్లా క్లినిక్‌లు ఏర్పాటు చేస్తాం, స్వామినాథన్ కమిషన్ సిఫార్సు మేరకు అన్ని పంటలకు మద్దతు ధరలను రైతులకు ఇస్తాం' అని ఇండియా కూటమి హామీనిచ్చింది. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ భార్య సునీతా కేజ్రీవాల్ ఈ మేరకు తన భర్త సందేశాన్ని సభలో చదివి వినిపించారు. అదే సమయంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఇండియా కూటమి తరపున ఐదు డిమాండ్లను ఎన్నికల కమిషన్ ముందరుంచారు. సార్వత్రిక ఎన్నికలు

- మిగతా 2 లో

గ్రామ, వార్డు సచివాలయాల్లో పెన్షన్లు

- 3వ తేదీ నుంచి పంపిణీ
- ప్రభుత్వం కీలక ఉత్తర్వులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల్లో పెన్షన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీజేశారు. దీంతో పెన్షన్లు ఎవరు పంపిణీ చేస్తారన్న అంశానికి తెరపడింది. ఈనెల 3వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల కేంద్రంగా పెన్షన్ పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని వార్డు వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పెన్షన్లను పంపిణీ చేసేవారు. ప్రతినెలా ఒకటో తేదీన వలంటీర్లు ఇంటింటికీ వచ్చి వృద్ధులకు పెన్షన్లు అందజేస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనందున ఆ తరహాగా వలంటీర్ల ద్వారా పెన్షన్ల పంపిణీ నిలిపేయాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ నిర్వాహకులు నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పెన్షన్లను పంపిణీ చేయవద్దని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. దీంతో పెన్షన్లను ఎలా పంపిణీ చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. దీంతో ఇంటింటికీ వెళ్లి పెన్షన్ పంపిణీ చేయడానికి ప్రత్యామ్నాయ

- మిగతా 2 లో

విపత్తులో దేశం

- ప్రజాస్వామ్యం, విపక్షాలపై బీజేపీ యుద్ధం
- ఓటుతోనే బుద్ధి చెప్పాలి
- సీపీఐ ప్రధాన కార్యదర్శి రాజా

న్యూఢిల్లీ: నిరంకుశత్వం, నియంత పాలన కోసం ప్రయాస పడుతున్న బీజేపీకి ఓటుతోనే బుద్ధి చెప్పాలని దేశ ప్రజలకు వామపక్షాలు పిలుపునిచ్చాయి. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగాన్ని, ప్రజల హక్కులను కాపాడుకోవడం కోసం కాషాయ పార్టీని అధికారానికి దూరం చేయడం అనివార్యమని నొక్కిచెప్పాయి. ఫాసిస్టు అజెండాతో పాలనను స్వీకరించబోమని ఉద్ఘాటించాయి. ప్రధాని మోదీ తన పద్ధతిలో వెళితే మన దేశం మతరాజ్యంగా మారుతుందని హెచ్చరించాయి. దేశం

- మిగతా 2 లో

అడ్వాణీకి 'భారత రత్న' ప్రదానం

ఇంటికి వెళ్లి అందించిన రాష్ట్రపతి ముర్ము

8లో

కాంగ్రెస్‌కు మరో ఐటీ నోటీసు?

- మొత్తం రూ.3,567 కోట్లు కట్టాలన్న ఐటీశాఖ!
- వెల్లడించిన పార్టీ వర్గాలు

8లో

పోటాపోటీ ప్రచారం

- తరుముకొస్తున్న ఎన్నికలు
- 43 రోజులే వ్యవధి
- భారీ సభలు, రోడ్‌షోలతో హోరెత్తిస్తున్న అధినేతలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఇప్పటికే ప్రధాన పక్షాల అభ్యర్థులు ఖరారుకావడంతో వారంతా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఏపీలో సార్వత్రిక ఎన్నికలను నాలుగో దశలో అనగా మే 13వ తేదీన నిర్వహించనున్నారు. 43 రోజులు మాత్రమే గడువు మిగిలుంది. మొదట రాష్ట్ర ఎన్నికలు నాలుగో దశలో ప్రకటించినప్పుడు... అప్పటికి రెండు నెలల సమయం ఉండగా, చాలా రోజుల వ్యవధి ఉన్నట్లుగా రాజకీయ పార్టీలు భావించాయి. అయితే అభ్యర్థుల ఎంపిక పూర్తయ్యేసరికి సమయం తగ్గిపోవడంతో అసెంబ్లీ, పార్లమెంట్ బరిలో ఉన్న అభ్యర్థులు ప్రణాళిక బద్ధంగా తమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మేమంతా సిద్ధం పేరుతో వైసీపీ అధినేత, సీఎం జగన్ బస్సుయాత్రకు శ్రీకారం చుట్టారు. ఏప్రిల్ 27వ తేదీ నుంచి ప్రారంభమైన బస్సు యాత్రలు రాష్ట్ర వ్యాప్తంగా 21 రోజులపాటు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా సీఎం జగన్ గతంలో సిద్ధం సభలు జరిగిన నాలుగు జిల్లాలను మినహాయించి...మిగిలిన అన్ని జిల్లాల్లో రోజుకొక బహిరంగ సభలో ప్రసంగించడంతోపాటు రోడ్ షోలు నిర్వహిస్తున్నారు. ఉదయం పూట మేధావులు, ప్రజలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించి, సూచనలు, సలహాలను స్వీకరిస్తున్నారు. ఇప్పటికే వైసీపీ 175 అసెంబ్లీ, 25 పార్లమెంటు

- మిగతా 2 లో

భానుడి భగభగ

- అల్లాడుతున్న వృద్ధులు, చిన్నారులు
- బయటకు వెళ్లేందుకు భయపడుతున్న ప్రయాణికులు
- ఉపాధి కోల్పోతున్న కూలీలు, చిరువ్యాపారులు

భానుడు భగభగ మండుతున్నాడు. మార్చిలోనే సెగలుకక్కుతుండడంతో బయటకు వెళ్లేందుకు ప్రజలు భయపడుతున్నారు. వారం రోజులుగా ఎండ తీవ్రత పెరగడంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు అల్లాడుతున్నారు. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అర్ధరాత్రి వరకూ వేడి తగ్గకపోవడంతో సామాన్యులు జాగారం చేస్తున్నారు. చిరు వ్యాపారులు, రోజువారి కూలీలు ఎండకు భయపడి పనులకు వెళ్లలేకపోతున్నారు. మండుటెండల ప్రభావం రాజకీయ ప్రచారంపై పడింది. అభ్యర్థులు ప్రచారం సమయాలను మార్చుకుంటున్నారు. రుతుపవనాలు వచ్చేంతవరకు వడగాడ్పులు, ఎండ తీవ్రత తప్పదని వాతావరణశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

2లో

ఇదీ లోకం!



ఏంటీ..ఈ ప్రాంతమంతా ఎందుకిలా అయిపోయిందా? తమరు పర్యటన కొచ్చినపుడల్లా కొట్టిపారేశారు..బాబయ్యా!

వైసీపీ చిత్తుగా ఓడటం ఖాయం

ప్రజాగళం సభల్లో చంద్రబాబు

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు/మార్కాపురం/బాపట్ల: రానున్న ఎన్నికల్లో వైసీపీ చిత్తుగా ఓడటం ఖాయమని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ప్రతి రోజు బటన్ నొక్కా.. బటన్ నొక్కా అని చెప్పే జగన్ బటన్ నొక్కింది ఎంత? ప్రజాధనం బొక్కింది ఎంత? సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, ప్రకాశం జిల్లా మార్కాపురం, బాపట్లలో జరిగిన ప్రజాగళం సభల్లో ప్రసంగించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక పోలవరం, వెలిగొండ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేస్తామన్నారు. రామాయపట్నం

- మిగతా 2 లో

హిమాలయాల్లో
మెగా ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు వద్దు

- వీటిని పూర్తిగా నిషేధించాలి
- కొనసాగుతున్న ప్రాజెక్టులను క్రమంగా సమీక్షించాలి
- 60కుపైగా పర్యావరణ, సామాజిక సంఘాల డిమాండ్

న్యూఢిల్లీ: హిమాలయాల్లో మెగా ఇన్‌ఫ్రా (మౌలికవసతుల) ప్రాజెక్టులను పూర్తిగా నిషేధించాలని 60కుపైగా పర్యావరణ, సామాజిక సంఘాల 'పీపుల్ ఫర్ హిమాలయ' ఉద్యమం డిమాండ్ చేసింది. ఆనకట్టలు, నాలుగు లేన్ల రహదారులు, రైల్వే, జలవిద్యుత్ ప్రాజెక్టులను హిమాలయాల్లో చేపట్టవద్దని నొక్కిచెప్పింది. కొనసాగుతున్న ప్రాజెక్టులను క్రమంగా సమీక్షించాలని కూడా డిమాండ్ చేసింది. సార్వత్రిక ఎన్నికల వేళ ఈ ఫోరం ప్రధానంగా ఐదు డిమాండ్లు చేసింది. భారీస్థాయిలో చేపట్టే మౌలిక వసతుల ప్రాజెక్టుల విషయంలో ప్రజల అభిప్రాయాల సేకరణను తప్పనిసరిగా సేకరించాలని, ప్రజాస్వామ్యబద్ధమైన నిర్ణయాధికారం ఉండాలని, పర్యావరణ ప్రభావం అంచనా-2020కు సవరణలు; అటవీ సంరక్షణ చట్టం-2023, ఈఐఏ-1994 రద్దు చేయాలని డిమాండ్ చేసింది. హిమాలయాల వనరులను పరిశ్రమలు దోచుకుంటుండగా దాని దుష్ప్రరిణామాలను స్థానికులు అనుభవించాల్సి వస్తోందని పర్యావరణ కార్యకర్త, మెగసెసే అవార్డు గ్రహీత సోనమ్ వాంగ్‌చుక్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పన్ను చెల్లింపుదారుల డబ్బును పునరావాస కసరత్తు కోసం ప్రభుత్వం వెచ్చిస్తోందనిగానీ తద్వారా లబ్ధి పొందేవారి విషయంలో జవాబుదారీతనం

- మిగతా 2 లో

విశాఖ పోర్టు సరికొత్త రికార్డు

- 81మెట్రిక్ టన్నుల సరుకు రవాణా
- ఐదేళ్లుగా ప్రగతి పథంలో పోర్టు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: సరుకు రవాణాలో విశాఖ పోర్టు 2023-24 ఆర్థిక సంవత్సరంలో 81.09 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా చేసి పోర్టు చరిత్రలోనే సరికొత్త రికార్డు నెలకొల్పింది. తద్వారా గత ఏడాది 73.75 మిలియన్

- మిగతా 2 లో

పెరూ అధ్యక్ష భవనంలో సోదాలు

చిక్కుల్లో పడేసిన రోలెక్స్ వాచ్

లిమా: పెరూ అధ్యక్షురాలు దీనా బొలువార్టే చేతి గడియారం ఆమెను చిక్కుల్లో పడవేసింది. ఆమె నివాసంపై ఐటీ దాడులు జరిగేందుకు కారణమైంది. ఐటీ అధికారులు సోదాలు జరిపిన దృశ్యాలు స్థానిక మీడియా ప్రసారం చేసింది. 20 మంది అధికారులు మరో 20 మంది పోలీసులు కలిసి అధ్యక్ష భవనంలో తనిఖీలు చేపట్టినట్లు వార్తాకథనాలు వెల్లడించాయి. సర్వోన్నత న్యాయస్థానం నియమించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమక్షంలో సోదాలు జరిగాయి. అధ్యక్ష పదవి చేపట్టే సమయంలో తన వద్ద రోలెక్స్ చేతి గడియారం ఉన్నట్లు దీనా వెల్లడించలేదు. అధికారాన్ని దుర్వినియోగించారని, అవినీతికి పాల్పడ్డారని ఆమెపై ఆరోపణలు వచ్చాయి. ఇదే కోణంలో దర్యాప్తు మొదలైంది. పెరూ తొలి మహిళా అధ్యక్షురాలుగా ఎన్నికైన దీనా ఇప్పుడు అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఆరోపణలు రుజువైనాగానీ ఆమె పదవీకాలం ముగిసేంత వరకు ఎటువంటి చర్యలు తీసుకునేందుకు ఆ దేశ రాజ్యాంగం అనుమతించదు. 2026 జులై వరకు పెరూ అధ్యక్షురాలిగా దీనా కొనసాగనున్నారు. కాగా, తనిఖీలకు అధ్యక్ష భవన సిబ్బంది పూర్తిగా సహకరించినట్లు అధికారిక ప్రకటన వెల్లడించింది.

స్వశక్తితో ఎదిగా: దీనా

తాను స్వశక్తితో ఎదిగానని, ప్రజా ధనంతో ఖరీదైన వస్తువులు ఏమీ కొనుగోలు చేయలేదంటూ తనపై అవినీతి ఆరోపణలను దీనా బొలువార్టే కొట్టిపారేశారు. 18 ఏళ్ల వయస్సు నుంచి కష్టపడుతున్నాను. ఎటువంటి కళంకం లేకుండా అధ్యక్ష పీఠాన్ని అధిష్ఠించాను... మరక లేకుండానే నిష్క్రమిస్తా' అని ఆమె అన్నారు.

ఇది తీవ్రమైన చర్య: ప్రధాని గుస్టావో

అధ్యక్ష నివాసంలో ఐటీ దాడులు జరగడంపై ప్రధాని గుస్టావో ఆండ్రియాజ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది తీవ్రమైన రాజ్యాంగ విరుద్ధ చర్య అని అన్నారు. దీని ప్రభావం మొత్తం దేశంపై ఉంటుందన్నారు.

విశాలాంధ్ర ప్రపంచం

పలస్తీనా ప్రధాని ముస్తఫా ప్రమాణ స్వీకారం

జెరూసలేం: పలస్తీనా నూతన ప్రధాని మహమ్మద్ ముస్తఫా ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. కొత్త మంత్రివర్గం కూడా కొలువుదీరింది. కొత్త ప్రభుత్వ కార్యాచరణ ప్రణాళికను శనివారం అధ్యక్షుడు అబ్బాస్‌కు సమర్పించారు. కొత్త ప్రభుత్వానికి అబ్బాస్ ఆమోదం తెలిపారు. మానవతా అంశాలు, గాజా స్ట్రిప్‌లోని పలస్తీనియన్లకు మానవతా సాయం కోసం సమగ్ర ప్రణాళిక రూపొందించడం, ప్రాంత పునరుద్ధరణకు తొలి ప్రాధాన్యతను కొత్త ప్రభుత్వం ఇవ్వనున్నట్లు అధికారిక ప్రకటన తెలిపింది. ఆర్థిక సుస్థిరతకూ ముస్తఫా ప్రభుత్వం కృషి చేయనున్నది. ప్రధానిగానే కాకుండా విదేశాంగ మంత్రిగానూ ముస్తఫా ప్రమాణ స్వీకారం చేశారు.

ఆర్కన్సాస్ నదిపై వంతెనను ఢీకొన్న బార్జ్

ఓక్లహోమా: అమెరికా, ఓక్లహోమాలోని ఆర్కన్సాస్ నదిపై వంతెనను బార్జ్ ఢీకొంది. దీంతో సాల్లిసా హైవే దక్షిణ భాగాన్ని స్థానిక పెట్రోలింగ్ బృందాలు మూసివేశాయి. వాహనాలను దారి మళ్లించాయి. ఈ ఘటనలో బార్జ్ దెబ్బతినగా వంతెన పరిస్థితిని అధికారులు సమీక్షిస్తున్నారు. బాల్టిమోర్‌లో వంతెనను రవాణా నౌక ఢీకొన్న ఘటన మరువక ముందు తాజా ఘటన జరగడం చర్చనీయాంశంగా మారింది.

రఫాలో ఇజ్రాయిల్ దాడులకు ఈజిప్టు, జోర్డాన్, ఫ్రాన్స్ ఖండన

కైరో: దక్షిణ గాజా స్ట్రిప్‌లోని రఫా నగరంలో ఇజ్రాయిల్ దళాల దాడులను ఈజిప్టు, జోర్డాన్, ఫ్రాన్స్ విదేశాంగ మంత్రులు తీవ్రంగా ఖండించారు. తక్షణమే కాల్పుల విరమణను అమలు చేయాలని పిలుపునిచ్చారు. 1.5 మిలియన్ల మంది పలస్తీనియన్లకు ఆశ్రయం కల్పించే రఫాపై ఏ రకంలో సైనిక దాడులు చేసినా ఖండిస్తామని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో దాడులు జరిపితే మానవతా సంక్షోభం తీవ్రరూపం దాల్చుతుందని హెచ్చరించారు. తక్షణమే కాల్పులు విరమించాలని, దాడులు ఆపేయాలని, బందీలను విడుదల చేయాలని, గాజాకు సంబంధించిన ఐరాస భద్రతామండలి తీర్మానాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని మంత్రులు పిలుపునిచ్చారు. పలస్తీనా శరణార్థుల కోసం ఐక్యరాజ్య సమితి అధ్వర్యంలో పలస్తీనా శరణార్థులకు సహాయక సహకారాలను అందిస్తున్న యూఎన్ఆర్‌డబ్ల్యూఏ సేవలను ముగ్గురు మంత్రులు కొనియాడినట్లు అధికారిక ప్రకటన పేర్కొంది.

విశాఖ పోర్టు సరికొత్త రికార్డు

(మొదటిపేజీ తరువాయి)

మెట్రిక్ టన్నుల రికార్డును తిరగరాసింది. ఈ రికార్డు విశాఖ పోర్టు సామర్థ్యాన్ని తెలియ జేయడమే కాక మారీటైం సెక్టార్ లో విశాఖపోర్టు ప్రాముఖ్యతను మరోమారు చాటిచెప్పింది. పోర్టు ఈ ఘనతను సాధించడంపై పోర్టు చైర్‌పర్సన్ డా.ఎం.అంగముత్తు సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఘనతను సాధించేందుకు అహర్నిశలు శ్రమించిన పోర్టు సిబ్బందిని చైర్‌పర్సన్ ప్రశంసించారు. ఈ ఘనత పోర్టులో నూతన శకానికి నాంది పలుకుతుందని పోర్టు సామర్థ్యానికి ఇది గీటురాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో సరుకు రవాణాలో మరిన్ని రికార్డులు నెలకొల్పాలని ఆకాంక్షించారు. గడచిన ఐదేళ్లలో సరుకు రవాణాలో విశాఖపోర్టు సాధించిన ప్రగతి ఇలా ఉంది.

2019-2020	**72.72 (మిలియన్ మెట్రిక్ టన్నులు)**
2020-2021	69.84
2021-2022	69.03
2022-2023	73.75
2023-2024	81.09

కోవిడ్-19 కారణంగా ప్రజా రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిన సమయంలో కూడా విశాఖపట్నం పోర్టు రెండేళ్ల పాటు సరుకు రవాణాలో ప్రగతి కనబరిచింది. వివిధ రకాల సరుకు రవాణాలో కూడా పెరుగుదల కనిపించింది. ఈ ఏడాది క్రూడ్ ఆయిల్ రవాణాలో 27 శాతం, ఇనుప ఖనిజం 12 శాతం, ఎరువుల రవాణాలో6 శాతం పెరుగుదల నమోదైంది. 43 ఫీమ్ కలిగిన బేబీ కేప్ నౌకలు గత ఏడాదితో పోల్చుకుంటే అధికంగా ఇన్నర్ హార్బర్ లో కార్యకలాపాలు నిర్వహించాయి. పోర్టులోకి వచ్చిన నౌకలలో సైతం 35 శాతం పెరుగుదల నమోదైంది. విశాఖ కంటైనర్ టెర్మినల్ కూడా 28 శాతం అధికంగా 6.65 లక్షల టీఈయు లను హ్యాండిల్ చేసింది. పనితీరు సూచీలలో మెరుగుదల నమోదైంది. ప్రి బెర్తింగ్ డిటెన్షన్ లో 68శాతం, టర్న్ అరౌండ్ టైం, అవుట్‌పుట్ ఫర్ షిప్ బెర్త్ డే లో 10 శాతం, ఐడల్ టైం బెర్తింగ్ లో 8 శాతం మెరుగుదలను నమోదు చేసింది. ఈ వివరాలను పోర్టు కార్యదర్శి టీ వేణుగోపాల్ మీడియాకు అందజేశారు.

గ్రామ, వార్డు సచివాలయాల్లో పెన్షన్లు

(మొదటిపేజీ తరువాయి)

సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో గ్రామ, వార్డు సచివాలయంలోనే పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. పెన్షన్ లబ్దిదారుల ఆధార్ కార్డు, బయోమెట్రిక్ ఆధారంగా పెన్షన్ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. వలంటీర్లు ఇంటింటికీ పెన్షన్లు పంపిణీ చేసినప్పుడు రెండు, మూడు రోజుల్లోనే ఈ ప్రక్రియ పూర్తయ్యేది. ఇప్పుడు తొలిసారిగా వలంటీర్లు లేకుండా, గ్రామ, వార్డు సచివాలయాల అధికారుల ద్వారా పెన్షన్ల పంపిణీ చేపట్టడంతో మరింత జాప్యమయ్యే పరిస్థితులున్నాయి. వృద్ధులు తప్పనిసరిగా గ్రామ, వార్డు సచివాలయాలకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇండియా కూటమితోనే ప్రజాస్వామ్యానికి రక్ష

(మొదటిపేజీ తరువాయి)

పారదర్శకంగా జరిగేలా చూస్తామని, అన్ని పార్టీలకు సమాన అవకాశాలు కల్పిస్తామని హామీ ఇవ్వాలన్నారు. అలాగే ఎన్నికల వేళ ప్రతిపక్ష పార్టీలను దెబ్బతీసే విధంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఆదాయపు పన్ను శాఖ, సీబీఐ దాడులు చేయకుండా ఆదేశాలివ్వాలి. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను తక్షణమే విడుదల చేయాలి. విపక్షాలను ఆర్థికంగా బలహీనపర్చే చర్యలను వెంటనే ఆపేయాలి. ఎన్నికల బాండ్ల ద్వారా బీజేపీ 'దోపిడీ'పై సుప్రీంకోర్టు నియమిత సిట్‌తో విచారణ జరిపించాలి' అని డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ నినాదంతో ఇండియా కూటమి ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో తలపెట్టిన మహార్యాలీ విజయవంతమైంది. కూటమిలోని 29 పార్టీల నాయకులు హాజరు కాగా మద్దతుదారులతో మైదానం కిక్కిరిసింది. విపక్ష కూటమి ఐక్యంగా, పటిష్ఠంగా ఉన్నదన్న సందేశాన్ని ఈ ర్యాలీ ఇచ్చింది. ఈ సందర్భంగా మోదీ ప్రభుత్వ వినాశకర పాలనను ప్రతిపక్ష నాయకులు తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. విపక్షాలు లేకుండా చేయాలని కుట్రలు చేస్తున్నారని, నియంతృత్వాన్ని సాగించాలని కోరుకుంటున్నారని విమర్శించారు. కేజ్రీవాల్ భార్య సునీతతో పాటు హేమంత్ సోరెన్ భార్య కల్పనకు సంఘీభావం తెలిపారు. బీజేపీని ఓడించాలని, ఇండియా కూటమిని గెలిపించాలని నాయకులు పిలుపునిచ్చారు. మోదీని, ఆయన సిద్ధాంతాలను సాగనంపితే తప్ప దేశం పురోగతి సాధించలేదని నొక్కిచెప్పారు.

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ దేశాన్ని నాశనం చేసే విషంగా ఆర్ఎస్ఎస్-బీజేపీని విమర్శించారు. ఐక్యంగా ఉంటేనే బలంగా ముందుకెళ్లగమని, బీజేపీని ఓడించగలమని విపక్ష పార్టీలు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణకు సమ్మిళితంగా పోరాడదామని సూచించారు. ఆర్ఎస్ఎస్-బీజేపీ విషంతో సమానమని, రుచి చూడాలనుకుంటే అధోగతేనని హెచ్చరించారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల మ్యాచ్‌ఫిక్సింగ్‌కు బీజేపీ యత్నిస్తోందని, ప్రధాన ఆటగాళ్లను కటకటాల వెనక్కు పంపుతోందని విమర్శించారు. ఇది సాధారణ ఎన్నికలు కాబోవు... దేశాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు జరుగుతు ఎన్నికలు కాబట్టి ఇండియా కూటమికి అండగా నిలవండి అని ప్రజలను కోరారు. ప్రతిపక్షాలే లక్ష్యంగా కేంద్ర దర్యాప్తు సంస్థలను కేంద్రం దుర్వినియోగిస్తోందని దుయ్యబట్టారు. నియంతృత్వానికి స్వస్తి పలికి.. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. ప్రియాంక గాంధీ మాట్లాడుతూ పోరాడేందుకు, గెలిచేందుకు, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఇండియా కూటమి కట్టుబడి ఉందని అన్నారు. సత్యం కోసం రాముడు పోరాడినప్పుడు ఆయన వద్ద అధికారం గానీ వనరులుగానీ రథంగానీ లేదు... రావణుడి వద్ద అన్నీ ఉన్నాయి... అయినా వధ తప్పలేదు...రాముడి జీవితం నుంచి మోదీ పాఠం నేర్చుకోవాలని, అహాన్ని వీడాలని వ్యాఖ్యానించారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ 'భారత కమ్యూనిస్టు పార్టీ నేడు మీతో కలిసి భారత్, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పరిరక్షణకు, బీజేపీ ఓటమికి సంకల్పిస్తోంది' అని నొక్కిచెప్పారు. ఇండియా కూటమిలో బలంగా ఉన్నామన్న సందేశాన్ని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ పంపారు. దేశంలో వకీల్, దలీల్ లేక అపీల్ (న్యాయవాది, వాదనలు, ఫిర్యాదులు) లేకుండా జనాన్ని జైళ్లలో పెడుతున్నారని, దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ ఆవేదన వ్యక్తంచేశారు. బీజేపీని గద్దె దించకపోతే దేశంలో నియంతృత్వం వర్ధిల్లుతుందని శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే హెచ్చరించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడమే అభిమతమని పంజాబ్ సీఎం భగవంత్ మాన్ నొక్కిచెప్పారు. దేశంలో అప్రకటిత అత్యవసర పరిస్థితి ఉన్నదని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ వ్యాఖ్యానించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఓటమి తథ్యమని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ధీమా వ్యక్తంచేశారు. పులిని ఎక్కువ కాలం బంధించలేరని కేజ్రీవాల్‌నుద్దేశించి ఆయన భార్య సునీత వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికలు భావితరాల భవిష్యత్‌ను నిర్ణయిస్తాయని కల్పనా సోరెన్ అన్నారు.

భానుడి భగభగ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి/విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు రోజురోజుకూ పెరుగు తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వాతావరణం ఒక్కసారిగా వేడెక్కడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారంరోజులుగా ఎండలు భగభగ మండుతున్నాయి. వడగాడ్పులు, ఉక్కపోతతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఉక్కిరిబిక్కిరౌతున్నారు. మండుటెండల కారణంగా చాలా మంది ఇళ్లకే పరిమితమౌతున్నారు. ఏసీ, కూలర్ల వినియోగం మరింత పెరుగుతోంది. దాని ప్రభావంతో విద్యుత్ బిల్లులు తడిసిమోపెడవుతు న్నాయి. మండుటెండలతో విజయవాడ, విశాఖ, తిరుపతి తదితర ప్రధాన నగరాల్లోని రోడ్లపై ప్రయాణికుల రాకపోకలు పలచబడుతున్నాయి. చిరు వ్యాపారులు, రోజువారీ కూలీలు అవస్థలు పడుతున్నారు. ఇటీవల పరీక్షలు రాసిన పది, ఇంటర్ విద్యార్థులూ ఎండలకు చెమటలుకక్కారు. పరీక్షలకు సన్నద్ధమవుతున్న జేఈఈ మెయిన్స్ అభ్యర్థులకూ ఎండలు ఇబ్బందికరంగా మారనున్నాయి.

వడదెబ్బకు ఎక్కడ గురికావాల్సి వస్తుందోనని సామాన్య ప్రజలు సైతం ఎండలు తగ్గుముఖం పట్టాకనే బయటకు వస్తున్నారు. మండుటెండల ప్రభావం రాజకీయ నేతల ప్రచారంపైనా పడింది. ఉదయం 12 గంటలలోపు, సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి వరకు ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల పూర్తిస్థాయిలో ప్రచారానికి అభ్యర్థులు సన్నద్ధమైనప్పటికీ, వారి వెంట వచ్చే కార్యకర్తలు వెనక్కి తగ్గుతున్నారు. రోజువారీ కూలీలు దూర ప్రాంతాల పనులకు వెళ్లలేక ఉపాధిని కోల్పోతున్నారు. రాయలసీమ, మధ్య ఆంధ్ర, ఉత్తరాంధ్ర జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అనంతపురం, ఆదోని, ధర్మవరం, కర్నూలు,ఏలూరు, విజయవాడ, చిత్తూరు, గుంటూరు, రాజమహేంద్రవరం, అనకాపల్లి, చిలకలూరిపేట తదితర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా నమోదవుతున్నాయి. ఇదే రీతిలో మరిన్ని రోజులు ఎండలు కొనసాగితే వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉందనీ, ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. ప్రత్యేకించి ఉత్తరాంధ్రలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో ప్రజలు ఉక్కపోతకు గురవుతున్నారు. మార్చి ఆఖరి వారంలో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్, మే , జూన్ నెలల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని అంటున్నారు. సముద్రతీర ప్రాంతమైనా ఉష్ణతాపం అధికంగానే ఉండనుంది. రాత్రివేళ వేడిసెగలు పుడుతున్నాయి. జూన్ మొదటివారం వరకు ఇవే పరిస్థితులు కొనసాగనున్నాయని వాతావరణశాఖ వెల్లడిస్తోంది. అటు రుతుపవనాలు వచ్చేంత వరకు వడగాడ్పులు, ఎండల ప్రభావం తప్పవని వాతావరణశాఖ అధికారులు స్పష్టం చేశారు.

వైసీపీ చిత్తుగా ఓడటం ఖాయం

(మొదటిపేజీ తరువాయి)

పోర్టుకు అన్ని అనుమతులు తెస్తే... వైసీపీ ప్రభుత్వం వచ్చాక పోర్టు పనులు ఆగిపోయాయన్నారు. జగన్ మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడుతున్నారని, నవరత్నాల పేరుతో నవ మోసాలు చేశారని విమర్శించారు. సంపద సృష్టించి... ఆదాయం పెంచి... పెంచిన ఆదాయాన్ని పేదలకు పంచుతామని హామీ ఇచ్చారు. అప్పులు తెచ్చే ముఖ్యమంత్రి కావాలా? సంపద సృష్టించే ముఖ్యమంత్రి కావాలా? తేల్చుకోవాలన్నారు. రూ.13లక్షల కోట్ల అప్పు సాక్షి పత్రిక, భారతి సిమెంటు కడతాయా? ప్రజలే కట్టాలన్నారు. సామాజిక న్యాయం అంటే ఏమిటో చేసి చూపించే పార్టీ టీడీపీ అని, బూటకాలు, నాటకాలు ఆడుతున్న పార్టీ వైసీపీ అని ఎద్దేవా చేశారు. మూడు పార్టీల నాయకులు కలిసి తొక్కుకుంటూ ముందుకు వెళ్తామన్నారు. తన 43 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇటువంటి ముఖ్యమంత్రిని చూడలేదని చెప్పారు. పార్లమెంట్‌లో ముస్లిం బిల్లులు తీసుకు వస్తే... మద్దతు పలికిన జగన్... ఇప్పుడు నాటకాలు ఆడుతున్నాడని మండిపడ్డారు. అబ్దుల్ సలాంని వేధించడంతో ఆ కుటుంబ సభ్యులంతా ఆత్మహత్య చేసుకున్నారని గుర్తు చేశారు. ఉర్దూను రెండో భాషగా మార్చింది తానేనన్నారు. అలాగే హైదరాబాద్, కర్నూలులో సైతం ఉర్దు యూనివర్సిటీలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ అయిదేళ్లలో మైనార్టీలకు ఒక్క పని అయినా చేశావా? చెప్పాలంటూ మార్కాపురం వేదిక మీద నుంచి సీఎం వైయస్ జగన్‌కు సవాల్ విసిరారు. ప్రజలు గెలవాలంటే.. కూటమి గెలవాలన్నారు. ఎన్నికలు లాంఛనమే అని, రాష్ట్రం లో అధికారంలోకి వచ్చేది టీడీపీయేనని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నో సభలు చూశానని, మండే ఎండల్లో ఎనలేని అభిమానం తో వస్తు ప్రజల వస్తున్నారన్నారు. నమ్మినోళ్లను నట్టేట ముంచిన దుర్మార్గుడు, నమ్మించి గొంతు కోసే రకం జగన్ అని ఆరోపించారు. రాయలసీమకు నీళ్లుంటే రతనాలు పండించే రైతులు ఇక్కడున్నారన్నారు. కేంద్రం మెడలు వంచి రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తానని చెప్పిన జగన్... ఎన్నికల తర్వాత కేంద్రం వద్ద మెడలు దించారని ఎద్దేవా చేశారు. మద్య నిషేధం చేశాకే ఓటు అడుగుతానన్న వ్యక్తి ఆ విధంగా చేశారా? ఏటా జాబ్ క్యాలెండర్ అన్నారు ఇచ్చారా? వారంలో సీపీఎస్ రద్దు అన్నారు . చేశారా? అని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీపైనే తొలి సంతకం చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. హైదరాబాద్‌ని తెలుగు జాతి కోసం తానే అభివృద్ధి చేశానన్నారు. హైటెక్ సిటీ, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, అవుటర్ రింగ్ రోడ్డు ఎవరు వేశారంటే... తన పేరే చెబుతారన్నారు. మాగుంటకి వైసీపీలో అన్యాయం జరిగిందని.. ఆయన్ని అగౌరవ పరిచి బయటకు వెళ్లేలా చేశారని గుర్తు చేశారు. ఆడ బిడ్డ నిధి కింద ప్రతీ నెలకు రూ.1500 ఇస్తామని.. అలాగే తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇస్తామని.. ఇక ప్రతి ఇంటికీ ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేస్తామని.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని... రైతులకు 20 వేలు ఇస్తామన్నారు. అలాగే 50 ఏళ్లకే పింఛన్ ఇవ్వడంతోపాటు 20 లక్షల ఉద్యోగులు భర్తీ చేస్తామన్నారు. రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. చంద్రబాబు సభలకు పెద్ద ఎత్తున కార్యకర్తలు, ప్రజలు హాజరయ్యారు.

పోటాపోటీ ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

స్థానాలకుగాను అభ్యర్థులను ప్రకటించింది. వాటి కోసం ఆర్నెల్లుగా ఇన్‌ఛార్జిల మార్పులు చేర్పులపై పెద్ద ఎత్తున కసరత్తు చేసింది. అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులకు సంబంధించి దాదాపు 70 మందిని మార్పులు, చేర్పులు గావించింది. దీనివల్ల 25 మంది ఎమ్మెల్యేలకు టికెట్లు దక్కలేదు. సిట్టింగ్ ఎంపీ స్థానాల్లో మూడో వంతు అభ్యర్థులను మార్చేసింది. ఒంటరి పోరుతో ముందుకు పోతుంది. మేనిఫెస్టోపైనా నిపుణులైన మేధావులతో కసరత్తు చేస్తూ గతంలో ఉన్న నవరత్నాలతో పాటు మరిన్ని అంశాలను చేర్పించే అంశంపై కసరత్తు చేస్తోంది. ఉగాది నాటికి వైసీపీ మేనిఫెస్టో విడుదలపై ఆ పార్టీ అధిష్ఠానం దృష్టి పెట్టింది. గత ఎన్నికల్లో 175 అసెంబ్లీలకు గాను 151 స్థానాలను, 25 ఎంపీ స్థానాలకుగాను 22 ఎంపీలను వైసీపీ గెలుపొందింది. రాబోయే ఎన్నికల్లో 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాల్లో గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇక కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల అధ్వర్యంలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ వేగవంతమైంది. షర్మిల కాంగ్రెస్ పగ్గాలు చేపట్టడంతో ఆ పార్టీలో కొంత జోష్ నెలకొంది. ఇండియా కూటమిలో భాగస్వామ్యమైన వామపక్ష పార్టీలతోనూ సీట్ల సర్దుబాటుపై కసరత్తు సాగుతోంది. కాంగ్రెస్ 9 గ్యారెంటీలతో మేనిఫెస్టో ప్రకటించి వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థుల జాబితా విడుదలపై కాంగ్రెస్ దృష్టి సారించింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 9 గ్యారెంటీలు అమలు చేస్తామని,ఏపీకి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమన్న నినాదాలతో ఆ పార్టీ ప్రచారం చేస్తోంది.

ఎన్డీఏలో భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీలు అభ్యర్థుల జాబితాలను విడుదల చేశాయి. జనసేన ఇంకా రెండు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి పొత్తులో భాగంగా టీడీపీ 144 అసెంబ్లీ స్థానాలు, 17 పార్లమెంట్ స్థానాల్లో పోటీకి దిగనుంది. అటు జనసేన ఇరవై ఒక్క అసెంబ్లీ స్థానాలు రెండు పార్లమెంటు స్థానాలకు పోటీ చేయనుంది. బీజేపీ 10 అసెంబ్లీ, 6 ఎంపీ స్థానాల్లో పోటీకి దిగనుంది. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజాగళం పేరుతో ఎన్నికల ప్రచార సభలను నిర్వహిస్తున్నారు. రాయలసీమ కేంద్రంగా ఆయన ప్రజాగళం ఎన్నికల సభలను ప్రారంభించి... జగన్ ప్రభుత్వ విధానాలను ఎండ గడుతున్నారు. రాబోయే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిదే గెలుపు అని నొక్కి చెబుతున్నారు. గత ఎన్నికల్లో టీడీపీ ఒంటరిగా బరిలోకి దిగి, 23 అసెంబ్లీ, 3 పార్లమెంట్ స్థానాలను గెలుపొందింది. మళ్లీ తిరిగి అధికారంలోకి వచ్చేందుకుగాను టీడీపీ వ్యూహాత్మకంగా ముందుకు పోతోంది. ఇందుకోసం ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకూడదనే లక్ష్యంతో జనసేన టీడీపీ చెంతకు చేరింది. ఆ రెండు పార్టీలతోపాటు బీజేపీతోను జతకట్టారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి మొదటి సభను చిలకలూరిపేటలో నిర్వహించగా... దీనికి ప్రధాని మోదీ హాజరై ప్రసంగించారు. అనంతరం ఎన్డీఏ కూటమికి చెందిన అభ్యర్థుల జాబితా పూర్తిగా కొలిక్కి రాకపోవడంతో వారి ప్రచారానికి కొంత విరామం ఏర్పడింది. కాగా జనసేన పార్టీ నాయకుడు పవన్ కల్యాణ్ పిఠాపురం నుంచి తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. కూటమి తరఫున ప్రచారానికి కేంద్ర బీజేపీ నేతలను రప్పించేందుకు పురందేశ్వరి ప్రణాళిక రూపొందిస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఈ ఎన్నికల్లో రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయనున్నారు. బీజేపీ సీనియర్ నేతలు జీవీఎల్, సోము వీర్రాజు, మాధవ్ వంటి సీనియర్ నేతలకు టికెట్లు దక్కలేదు. బీజేపీలో టీడీపీ ముద్ర ఉన్న వారికే టికెట్లు ఇచ్చారన్న ప్రచారముంది. అనంతపురం అర్బన్ ధర్మవరం, చీపురుపల్లి తదితర నియోజకవర్గ టీడీపీ నేతలకు టికెట్లు దక్కకపోవడంతో ఆధిష్ఠానంపై తిరుగుబావుటా ఎగురేస్తున్నారు. అసంతృప్త నేతలను టీడీపీ అధినేత చంద్రబాబు బుజ్జగిస్తున్నప్పటికీ, అందరూ దారికి రావడం లేదు. జనసేనలో టికెట్లు దక్కని చాలా మంది నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు రాజీనామాల బాట పట్టారు కొందరు వైసీపీలో చేరగా... మరికొందరు మౌనంగా ఉండిపోయారు. ఈ అసంతృప్తి నేతలను బుజ్జగిస్తూ, మరోవైపు ఎన్నికలకు వైసీపీ నేతలు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. కాగా ఎన్నికల కమిషన్ తనదైన శైలిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించిన వారిపై ఎప్పటికప్పుడు చర్యలకు ఆదేశిస్తోంది. ఎన్నికలకు 43 రోజుల సమయమే ఉండటంతో రోజురోజుకూ అభ్యర్థులు టెన్షన్‌కు గురవుతున్నారు.

విపత్తులో దేశం

(మొదటిపేజీ తరువాయి)

విపత్తుకర పరిస్థితులను ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేశాయి. ఎన్నికల సమరానికి కాదు ప్రజాస్వామ్యం, ప్రతిపక్షాలపై యుద్ధానికి బీజేపీ కాలుదువ్వుతోందని విమర్శించాయి. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, దేశాన్ని నాశనం చేస్తున్న శక్తిని ఓడిద్దామని 'లోకతంత్ర బచావో ర్యాలీ'లో సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్), ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శులు డి.రాజా, సీతారాం ఏచూరి, దీపాంకర్ భట్టాచార్య, జి.దేవరాజన్ పిలుపునిచ్చారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి అధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణే అజెండాగా భారీ ర్యాలీ జరిగింది. 29 ప్రతిపక్ష పార్టీల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, దీనిని పరిరక్షించుకోవడం అత్యవసరమని అన్నారు. ప్రతిపక్ష పార్టీలే లక్ష్యంగా ఈడీ, ఐటీ,సీబీఐ వంటి సంస్థలను కేంద్రప్రభుత్వం దుర్వినియోగిస్తోందని విమర్శించారు. ప్రస్తుతం దేశం విపత్తుకర పరిస్థితులను ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద విపత్తు ముంచుకొస్తోందని, దీని నుంచి దేశాన్ని కాపాడుకోవడం కోసం బీజేపీని గద్దె దించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో మనమంతా ఐక్యంగా, బలంగా ఉంటేనే భారత్‌ను కాపాడుకోగలమని రాజా నొక్కిచెప్పారు. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నైతికతను పాటిస్తున్నారా అంటూ మోదీని రాజా ప్రశ్నించారు. దేశ రాజకీయాల్లో కొత్తశక్తి ఆవిర్భవించిందని, అది భారత ప్రజాస్వామ్యాన్ని గెలిపిస్తుందని, నియంతృత్వాన్ని ఓడిస్తుందని ఏచూరి వ్యాఖ్యానించారు. అవినీతి, నిరంకుశత్వం నుంచి స్వేచ్ఛ కావాలంటే లౌకిక కూటమి 'ఇండియా'కు మద్దతివ్వండి అని పిలుపునిచ్చారు. 'జుడేగా భారత్, జీతేగా ఇండియా' అని ఏచూరి నినదించారు. దీపాంకర్ భట్టాచార్య మాట్లాడుతూ బీజేపీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు... ప్రజాస్వామ్యం, ప్రతిపక్షాలపై సమరానికి సిద్ధమైందని వ్యాఖ్యానించారు. ఎన్నికల బాండ్ల ద్వారా ఏ విధంగా వసూళ్లు జరిగాయో అందరికి తెలుసు... ఇప్పుడు వాటిని అడ్డుపెట్టుకొని పార్టీలను చీల్చేందుకు, ప్రభుత్వాలను కూల్చేందుకు యత్నిస్తున్నదని దుయ్యబట్టారు. ఎంపీలు, ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురి చేస్తున్నారన్నారు. ప్రలోభాలకు తలొగ్గని వారిని జైళ్లకు పంపుతున్నారని విమర్శించారు. ఆమ్ ఆద్మీ పార్టీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వదలడం లేదని, జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ జైలు పాలయ్యారని గుర్తుచేశారు. బీహార్‌లో తమ దళిత ఎమ్మెల్యే మనోజ్ మంజిల్‌తో పాటు మరో 22 మంది తప్పుడు కేసుల్లో నిర్బంధానికి గురయ్యారని భట్టాచార్య తెలిపారు. దేవరాజన్ మాట్లాడుతూ 'ఢిల్లీ ముఖ్యమంత్రిని అరెస్టు చేయించారు... అతిపెద్ద పార్టీ, ప్రధాన ప్రతిపక్షం బ్యాంకు ఖాతాలు సీజ్ చేయించారు. సీబీఐ, ఈడీ, ఐటీని ఇష్టమొచ్చినట్లు వాడేస్తూ విపక్ష నేతలను జైళ్లకు పంపుతున్నారు. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం కాకపోతే మరేమిటి' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. మోదీని ఓ బూరతో పోల్చుతూ ఈఎన్నికల్లో ఆ బూరలోని గాలిని తీసేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. '400 స్థానాల్లో గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తారు... వారు ప్రజాస్వామ్యం హంతకుల'ని అన్నారు. విపక్ష నేతలందరినీ జైలుకు పంపి నియంతృత్వాన్ని సాగించాలని కోరుకునే వారికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు.

మెగా ఇన్ఫ్రా ప్రాజెక్టులు వద్దు

(మొదటిపేజీ తరువాయి)

లేదన్నారు. హిమాలయాల భవిష్యత్‌కు హామీనివ్వాలని డిమాండ్ చేశారు. లాభాపేక్షతో కాదు ప్రజలు-ప్రకృతే కేంద్రంగా పరిపాలన సాగాలని వాంగ్‌చుక్ సూచించారు. హిమాలయ నీతి అభియాన్‌కు చెందిన గుమన్ సింగ్, జోషిమఠ్ బచావో సంఘర్ష్ కమిటీకి చెందిన అతుల్ సతీ కూడా ఈ ప్రచారోద్యమంలో పాల్గొంటూ హిమాలయాల పరిరక్షణకు డిమాండ్ చేశారు. వాంగ్‌చుక్ ఇటీవల లదాఖ్ కోసం 21 రోజుల నిరాహార దీక్షను ముగించిన విషయం తెలిసిందే. కాగా, హిమాలయాల్లో విపత్తులు సంభవించిన దృష్ట్యా ఈనెలారంభంలో పీపుల్ ఫర్ హిమాలయ ఉద్యమం ప్రారంభమైంది. పర్యావరణ విపత్తులు... వ్యూహాత్మకం-విధానపరమైన నిర్ణయాల పర్యవసానాలని తీర్మానించింది. ప్రభుత్వ వైఫల్యాలను, చారిత్రక దోపిడీని దుయ్యబట్టింది. అర్థంలేని పథకాలతో ముప్పు పెరుగుతోందని ఆరోపించింది. పర్యాటకాన్ని పెంపొందించేందుకు యాత్రలు, గ్లేషియర్ల ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం, రివర్‌ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టులతో ఈ ప్రాంతానికి హాని తలపెడుతున్నారని వ్యాఖ్యానించింది.

పింఛన్ టెన్షన్!

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో పింఛన్ టెన్షన్ నెలకొంది. ప్రతి నెలా మొదటి తారీకునే పింఛన్ అందుకునే లబ్ధిదారులు వలంటీర్ల ద్వారా ఇంటింటా పింఛన్ల పంపిణీని నిలిపివేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించడంతో ఎప్పటికి పింఛన్ అందేనో అని మదనపడుతున్నారు. ఇదే విషయమై అధికార వైసీపీ, టీడీపీ మధ్య విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు సకాలంలో పింఛన్ల పంపిణీకి ప్రభుత్వమే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సీఎస్‌కు టీడీపీ అధినేత చంద్రబాబు లేఖ రాశారు. బాబు తీరుపై వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ధ్వజమెత్తారు. మరోవైపు ఒకటి రెండు రోజుల్లో పింఛన్ పంపిణీ చేయకుంటే ఆందోళన నిర్వహిస్తామని కాంగ్రెస్ నాయకురాలు షర్మిల హెచ్చరించారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి
సీఎస్‌కు చంద్రబాబు లేఖ

పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి లబ్ధిదారులకు సకాలంలో అందేలా చూడాలని చంద్రబాబు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కేఎస్ జవహర్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. వలంటీర్ల ద్వారా పంపిణీకి కేంద్ర ఎన్నికల సంఘం అభ్యంతరాలు తెలిపిన నేపథ్యంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా డోర్ టు డోర్ విధానంలో పెన్షన్లు అందించే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఖజానాలో నిధుల లేమి కారణంగా పింఛన్ల పంపిణీ నిలిచిపోకూడదని, వెంటనే నిధులు కేటాయించి పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని పేర్కొన్నారు.

ఈసీ విశ్వసనీయత దెబ్బతీయడం తగదు: ముప్పాళ్ల

రాష్ట్రంలో ఇళ్ల పన్నులు, పింఛన్‌ల పంపిణీ అంటూ 8 లక్షల మంది వలంటీర్లను తమరాజకీయ ఓట్లు ప్రయోజనాల కోసం అడ్డగోలుగా వైసీపీ ప్రభుత్వం వాడుకోవటాన్ని గమనించిన ఎన్నిక సంఘం వలంటీర్లను పక్కన పెట్టాలని ఆదేశిస్తే ఎన్నికల నిబంధనల్ని, ఎన్నికల సంఘం విశ్వసనీయతను దెబ్బతీసేలా సీఎం జగన్ ప్రచారం చేయటాన్ని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, సామాజిక పింఛన్‌దారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఎన్నికల నింబంధనల మేరకు వలంటీర్లను ప్రక్కన పెడితే దానికి చంద్రబాబు, నిమ్మగడ్డ రమేష్‌కుమార్, ప్రతిపక్షాలు కారణం అంటూ జగన్ తమాషా రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికార పార్టీకి రాజకీయ ప్రయోజనాలు చేకూర్చుతున్న వలంటీర్లను పక్కనపెట్టమని ఆదేశించటంపై ఎన్నికల సంఘాన్ని అభినందించారు. సామాజిక సంక్షేమ సంఘం తరుపున రోజుకు రూ.200 చొప్పున వృద్ధులకు, వితంతువులకు నెలకు రూ.6వేలు, దివ్యాంగులకు నెలకూ 7వేలు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేసినా ఏడాది నుంచి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు.

సకాలంలో అందేలా చూడాలి: శ్రీనివాసరావు

ఎన్నికల షెడ్యూలు నేపథ్యంలో వలంటీర్ల ద్వారా పెన్షన్లు పంపిణీ నిలిపివేయడం వల్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి సకాలంలో వృద్ధులు, మహిళలు, వికలాంగులకు పెన్షన్లు అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆ మేరకు ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేస్తూ ఆయన ఆదివారం లేఖ పంపారు. ఇందుకు గ్రామ, వార్డు సచివాలయం, రెవెన్యూ ఉద్యోగుల సేవలను ఉపయోగించుకొని గతంలో లాగానే నేరుగా పెన్షన్‌దారులకు అందించాలని కోరారు. సచివాలయాలు దూరంగా ఉన్నచోట దగ్గరలో ఉండే పంచాయతీ కార్యాలయాలు, సిబ్బందిని కూడా దీనికి ఉపయోగించుకోవాలని సూచించారు.

నిస్సహాయులపై దొంగదెబ్బ: సజ్జల

'సిటిజన్స్ ఫర్ ఫోరమ్ డెమోక్రసీ' సంస్థ ద్వారా వలంటీర్ వ్యవస్థను దెబ్బతీసే క్రమంలో భాగంగానే చంద్రబాబు వలంటీర్లపై కక్ష బూనారని, ఇది ఆయన నైజానికి పరాకాష్ట అని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయకుండా నిమ్మగడ్డ ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించారని, తద్వారా పింఛన్ల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. ప్రభుత్వ పథకాలు అందుకుంటున్న నిస్సహాయులను చంద్రబాబు దొంగ దెబ్బతీశారని ధ్వజమెత్తారు. వైసీపీ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ అనే సంస్థ చంద్రబాబు బీ టీమ్ అని చెప్పారు. పక్కా టీడీపీ కార్యకర్తలా నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ పనిచేశాడని చెప్పారు. ఇది చంద్రబాబు, చౌకబారు, దిగజారుడు ఎత్తుగడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందే చంద్రబాబు తన నిజస్వరూపాన్ని బయటపెట్టారన్నారు. మళ్లీ జన్మభూమి కమిటీలు వస్తాయని చంద్రబాబు గుర్తుచేస్తున్నాడని పేర్కొన్నారు. వలంటీర్ వ్యవస్థపై ఎక్కుపెట్టిన బాణం తిరిగి చంద్రబాబుకే తగిలిందన్నారు. డ్యామేజ్ కంట్రోల్ కోసమే సీఎస్‌కు లేఖలు రాయడం మొదలు పెట్టారన్నారు. పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం కచ్చితంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తుందని, ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని మీకు ఎవరు చెప్పారు? కట్టు కథలు అల్లి తప్పించుకోలేరని మండిపడ్డారు. వలంటీర్లు ప్రజలతో ఓట్లు వేయిస్తారన్న భయంతోనే ఇదంతా చంద్రబాబు చేయించాడని, ఏదో చేయబోతే మరేదో అయిందని అన్నారు. పవన్ కల్యాణ్‌తోపాటు బీజేపీని కూడా చంద్రబాబు మింగేస్తాడన్నారు. పవన్ కల్యాణ్... కనీసం తన అభ్యర్థులను ఎంపిక చేసుకోలేని దుస్థితిలో ఉన్నాడని విమర్శించారు.

పేదలకు మంచిచేస్తే బాబుకు నచ్చదు:
ఎమ్మెల్యే పేర్ని నాని

ఇంటింటా పింఛన్లు అందజేస్తున్న వలంటీర్లపై చంద్రబాబు కక్ష కట్టారని మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) మండిపడ్డారు. సీఎం జగన్ పేదలకు మేలు చేసేందుకే వలంటీర్ల వ్యవస్థను తెచ్చారని, వలంటీర్ల వ్యవస్థ అంటే చంద్రబాబుకు గిట్టదని చెప్పారు. పేదలకు మంచిచేసే ఏ పనీ చంద్రబాబుకు నచ్చదన్నారు. పింఛన్ల పంపిణీని ఆపేందుకు చంద్రబాబు, ఆయన టీమ్ తీవ్రంగా కృషి చేశారని విమర్శించారు. సిటిజన్స్ ఫర్ ఫోరమ్ డెమోక్రసీ అనేదీ చంద్రబాబు జేబు సంస్థ అని అన్నారు.

రెండు మూడు రోజుల్లో పంపిణీ చేయకుంటే
ఆందోళన: షర్మిల

పింఛన్ల పంపిణీ నిలిపివేతపై సీఎస్ జవహర్‌రెడ్డితో కాంగ్రెస్ నాయకురాలు షర్మిల ఫోన్లో మాట్లాడారు. పింఛన్ల పంపిణీకి పది రోజులు పడుతుందని సీఎస్ చెప్పడంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. రెండు మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో పింఛన్ల పంపిణీ జరగకపోతే కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పింఛన్ల పంపిణీ ఆలస్యం చేయాలని అనుకోవడం ప్రభుత్వ కుట్రనేనని, ఎన్నికల కమిషన్ సూచనల ప్రకారం తక్షణమే పింఛన్లు విడుదల చేయాలని కోరారు.

సకాలంలో అందేలా చర్యలు

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా సకాలంలో పింఛన్లు పంపిణీ చేయించేందుకు తగు చర్యలు చేపట్టాలని కోరుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆదివారం లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నెలా 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు వృద్ధాప్య, వితంతు, వికలాంగ తదితర పింఛన్‌లను పంపిణీ చేస్తున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి పింఛన్ పంపిణీలో వలంటీర్లను వినియోగించరాదని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించిన నేపథ్యంలో రాష్ట్రంలోని పింఛన్‌దారులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. అందువల్ల తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా పింఛన్‌ల పంపిణీకి తగు చర్యలు చేపట్టవలసిందిగా ఆ లేఖలో రామకృష్ణ కోరారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది ద్వారా సకాలంలో పింఛన్‌లను నగదు రూపంలో అందించేటట్లు చూడాలని సూచించారు. పింఛన్‌ల పంపిణీకి అవసరమైన నిధులను అందుబాటులో ఉంచటంతో పాటు బ్యాంకుల నుంచి పింఛన్ మొత్తాన్ని సిబ్బంది తీసుకెళ్లేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు.

అధికారంలోకి రాగానే పాత ఇసుక విధానం: నారా లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అధికారంలోకి రాగానే పాత ఇసుక విధానాన్ని తీసుకొస్తామని మంగళగిరి టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ చెప్పారు. గుంటూరుజిల్లా తాడేపల్లి అన్నపూర్ణ రెసిడెన్సీలో ఆదివారం ఆయన స్థానికులతో మాట్లాడారు. సీఎం జగన్ మహానటుడు అని, ఆయన రాజకీయాలు వదిలి సినిమాల్లోకి వస్తే ఆస్కార్‌తోపాటు భాస్కర్ అవార్డులు వస్తాయని ఎద్దేవా చేశారు. తమ ఎన్డీయే కూటమి అధికారంలోకి రాగానే మైనింగ్ విభాగంపై విచారణ కమిటీ వేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లల్లో తొమ్మిదిసార్లు విద్యుత్ ఛార్జీలను పెంచిందని మండిపడ్డారు. ఇంటి పన్ను, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తాము తగ్గిస్తామన్నారు. వ్యవసాయ ఆధారిత ఉద్యోగులకు ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు.

పాలిసెట్‌కు నేటి నుంచి ఉచిత శిక్షణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా పాలిసెట్ ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సోమవారం నుంచి ఉచిత శిక్షణనిస్తున్నట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. 2023-2024 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి సమగ్ర శిక్షణ అందిస్తామన్నారు. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్‌లల్లో ఉచిత శిక్షణ కోసం వేలాదిగా విద్యార్థులు దరఖాస్తులు నమోదు చేశారని చెప్పారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించవచ్చన్నారు. 87 ప్రభుత్వ, 182 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 25వ తేదీ వరకు తరగతులు నిర్వహిస్తామని నాగరాణి వివరించారు. తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాలలో సిద్ధం చేసిన ఉచిత పాలిసెట్ కోచింగ్ మెటీరియల్‌ను విద్యార్థులకు అందిస్తామన్నారు. ఉదయం తొమ్మిది నుంచి ఒంటిగంట వరకు సాగే శిక్షణలో రెండు గంటల పాటు గణితం, ఓ గంట భౌతిక శాస్త్రం, మరో గంట రసాయన శాస్త్రం బోధిస్తారన్నారు. విద్యార్థుల్లో పరీక్షల భయం పోగొట్టేందుకు ఏప్రిల్ 25న ప్రీ ఫైనల్ ప్రవేశ పరీక్షను సైతం నిర్వహిస్తామని చెప్పారు. పాలిసెట్ ప్రవేశ పరీక్షా ఏప్రిల్ 27న కాగా, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులకు ఐదు వరకు స్వీకరిస్తామన్నారు.

చత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఘాతుకం

ఎన్‌కౌంటర్లకు నిరసనగా 4 టిప్పర్ల దహనం

విశాలాంధ్ర-చింతూరు: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో శనివారం అర్ధరాత్రి మావోయిస్టులు రెచ్చిపోయారు. నాలుగు టిప్పర్లను దహనం చేశారు. ఎన్‌కౌంటర్లకు నిరసనగా నారాయణపూర్ జిల్లా ఓర్చరోడ్‌లోని చోటేడోన్‌గేర్ మిడిల్ సెంటర్ వద్ద ఆత్మానందం స్కూల్ సమీపంలో ఆమదై ఇనుప ఖనిజాన్ని రవాణా చేయటానికి ఉపయోగిస్తున్న నాలుగు టిప్పర్లకు నిప్పంటించారు. డ్రైవర్, క్లీనర్లను దించేసి డీజిల్ ట్యాంకర్‌ను పగలగొట్టి దహనంచేశారు. డ్రైవర్, క్లీనర్‌లను మావోయిస్టులు తమవెంట తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న సీఆర్‌పీఎఫ్ దళాలు ఘటన స్థలానికి చేరుకున్నాయి. అప్పటికే మావోయిస్టులు తప్పించుకున్నారు. ఈ ఘటనను నారాయణపూర్ ఎస్పీ రాబిన్సన్ గురియా ధ్రువీకరించారు. ఇటీవల జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లకు నిరసనగా ఈ ఘాతుకానికి పాల్పడినట్టు ఓ కరపత్రాన్ని ఘటన స్థలంలో విడిచివెళ్లారు.

కాంగ్రెస్ గూటికి టీడీపీ నేత రాం పుల్లయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీలో చేరికల జోరు కొనసాగుతోంది. కర్నూల్ జిల్లాకు చెందిన టీడీపీ సీనియర్ నేత రాం పుల్లయ్య యాదవ్ ఆదివారం ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. పుల్లయ్యకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

సీఎం బస్సుయాత్ర షెడ్యూలు

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: మేమంతా సిద్ధం పేరుతో వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ నిర్వహిస్తున్న బస్సు యాత్ర షెడ్యూలును ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురామ్ విడుదల చేశారు. ఐదోరోజైన సోమవారం అనంతపురం జిల్లా సంజీవపురం నుంచి ఉదయం 9 గంటలకు సీఎం బయలుదేరతారు. బత్తలపల్లి, రామాపురం, కట్ట కిందపల్లి, రాళ్ల అనంతపురం, ముదిగుబ్బ, ఎన్‌ఎస్‌పి కొట్టల, మలకవేముల మీదుగా పట్నం చేరుకుంటారు. నడిరపల్లి, కాలసముద్రం, ఎర్ర దొడ్డి మీదుగా కుటగులకు సీఎం చేరుకుని మధ్యాహ్న భోజన విరామం తీసుకుంటారు. భోజన విరామం అనంతరం బయలుదేరి కదిరి పట్టణం చేరుకుంటారు. అక్కడ పీవీఆర్ ఫంక్షన్ హాల్ లో మైనార్టీ సోదరులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొంటారు. అనంతరం మోటుకపల్లె మీదుగా జోగన్నపేట, ఎస్.ములకలపల్లె మీదుగా వెళ్లి చీకటిమనిపల్లెలో రాత్రికి జగన్ బస చేస్తారు.

ఈస్టర్ శుభాకాంక్షలు: క్రైస్తవ సోదరులకు సీఎం వైఎస్ జగన్ ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. సత్యంలో ఉన్న శక్తిని, విశ్వాసాన్ని ప్రపంచానికి చాటిన మహిమానిత్వ పర్వదినం ఈస్టర్ అని, మనందరి జీవితాల్లో శాంతి, దయ, ప్రేమను, ఈస్టర్ నింపాలని ఆకాంక్షించారు.

ఉత్తరాంధ్రలో టీడీపీ టికెట్ల రగడ

గంటా, కళాకు తప్పని వర్గపోరు

విశాలాంధ్రబ్యూరో-విశాఖపట్నం: టీడీపీ తుది జాబితా ఉత్తరాంధ్రలో చిచ్చు రగిల్చింది. పాడేరులో రమేశ్ నాయుడును ఓడించి తీరుతామని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి స్పష్టం చేశారు. నాలుగున్నరేళ్లుగా భీమిలి ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్న తనను కాదని గంటా శ్రీనివాసరావుకు టికెట్ ఇవ్వడంపై చంద్రబాబు సమాధానం చెప్పాలని కోరాడ రాజబాబు డిమాండ్ చేశారు. చీపురుపల్లి సీటును కళా వెంకట్రావుకు ఇవ్వడంపై కిమిడి నాగార్జున కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇలా సీటు దక్కని ఉత్తరాంధ్రలోని అనేకమంది తెలుగుదేశం పార్టీ నాయకులు బాహాటంగానే తమ అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. పాతపట్నం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు కలమట వెంకటరమణ బహిరంగ సమావేశాలు పెట్టి మరీ విమర్శలు గుప్పించారు. ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఓడించడమే లక్ష్యంగా అహర్నిశలు కష్టపడతానని ప్రకటించారు. చీపురుపల్లి నియోజకవర్గం విషయంలో కిమిడి నాగార్జునను కాదని అక్కడ సీనియర్ నేత కళా వెంకట్రావుకు టిడిపి టికెట్ ఖరారు చేయడంతో కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించిన నాగార్జున... వారి సమక్షంలోనే తెలుగుదేశం పై ఆరోపణలు చేస్తూ పార్టీకి కష్టపడినందుకు ఇలా గుర్తించారని కన్నీళ్లు పెట్టుకున్నారు. యువత రాజకీయాల్లోకి రావద్దని తన అసహనాన్ని వ్యక్తపరిచారు. టీడీపీలో టికెట్ల రగడ ఇంకా కొనసాగుతూనే ఉంది. పెందుర్తి నియోజకవర్గం లో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి టికెట్ ఇవ్వకుండా అక్కడ జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబుకు టికెట్ ఇవ్వడం పై బండారు, ఆయన వర్గీయులు తమ అగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇటు విశాఖ దక్షిణ నియోజకవర్గంలో కూడా అదే జరిగింది. నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న గండి బాబ్జిని కాదని జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ కు టికెట్ కేటాయించడంపై దక్షిణ నియోజకవర్గంలో టీడీపీ నేతలు పెద్ద ఎత్తున అసంతృప్తి వ్యక్తం చేశారు.

గౌరవ వేతనాలు చెల్లించండి

14 నెలలుగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అవస్థలు

ప్రాంతీయ అధికారికి వినతి

విశాలాంధ్ర-పార్వతీపురం: ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గౌరవ వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రకృతి వ్యవసాయ సాగులో (ఏపీసీఎన్ఎఫ్) వివిధ క్యాడర్లో దాదాపు 450 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. 14 నెలల నుంచి జీతాలు అందక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ తక్షణమే వేతనాలు చెల్లించాలని బుధవారం రీజనల్ అధికారి కె. ప్రకాశ్, జిల్లా ప్రాజెక్ట్ అధికారి పి.షణ్ముఖ రాజుకు వినతిపత్రం అందజేశారు. 2023 ఫిబ్రవరి నుంచి 2024 మార్చి వరకు జీతాలు చెల్లించాల్సి ఉందనీ, గౌరవ వేతనాలు ఇవ్వకపోయినా అప్పులు చేసి విధులు నిర్వహిస్తున్నామనీ, ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతుండడంతో పని చేయలేకపోతున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. కుటుంబంతో ఇల్లుగడవడం చాలాకష్టంగా ఉందని, పిల్లలు చదువులకు ఫీజులు కట్టలేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నామనీ, అనారోగ్య పరిస్థితులలో ఇంట్లో కుటుంబ సభ్యులకు వైద్యం అందించలేకపోతున్నామని తెలిపారు. జీతాలు చెల్లించకుంటే విధులు నిర్వహించడం కష్టమని స్పష్టం చేశారు. ఫీల్డ్ కు వెళ్లాలన్నా, కార్యాలయానికి రావాలన్న రవాణా ఖర్చులకు చేతిలో డబ్బులులేకపోవడం వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుని వచ్చారు. ఉన్నతాధికారులు స్పందించి గౌరవ వేతనాలు చెల్లించాలని డివిజనల్ మాస్టర్ ట్రైనర్లు, మండల, యూనిట్ ఇన్‌ఛార్జిలు, మోడల్ మేకర్స్ , ఐపీఆర్పీలు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలో ఇదేపరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. దీనిపై డీపీఎం షణ్ముఖరాజులును వివరణకోరగా, సిబ్బందికి గౌరవవేతనాలు చెల్లించలేదన్నది వాస్తవమే అని, దీనిపై ఉన్నతాధికారులకు తెలియపర్చామని చెప్పారు. వారి ఆదేశాలు కోసం చూస్తున్నట్లు తెలిపారు.

బీజేపీని సాగనంపండి: ముప్పాళ్ల పిలుపు

విశాలాంధ్ర-నరసరావుపేట: దేశాన్ని కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతున్న కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు దేశంలోని ప్రతి ఓటరు, ప్రతి కార్యకర్త ఐక్యంగా ముందుకు సాగాలని, ఇండియా కూటమిని బలపరచాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యదర్శి ఏ.మారుతి వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన సీపీఐ పల్నాడు జిల్లా సమితి సమావేశంలో ముప్పాళ్ల మాట్లాడుతూ దేశంలో 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నరేంద్ర మోదీ కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతున్నాడని అన్నారు. 2014 ఎన్నికల ముందు నరేంద్ర మోదీ చేసిన వాగ్దానాలు నేటికీ నెరవేర్చలేదని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తూ దేశ సంపదను ఆదాని, అంబానీలకు దోచిపెడుతున్నారని చెప్పారు. వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, సామాన్య ప్రజలు జీవించే పరిస్థితి లేదని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కార్మికులను, కర్షకులను, సామాన్య ప్రజలను అనేక విధాలుగా ఇబ్బందులుపెడుతున్న బీజేపీ ప్రభుత్వం ఆదాని, అంబానీల వ్యాపారాలు అభివృద్ధి చేసేందుకు తోడ్పడుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో మోదీని సాగనంపేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని, సీపీఐతోపాటు 28 పార్టీలు బలపరుస్తున్న ఇండియా కూటమిని గెలిపించాలని ముప్పాళ్ల పిలుపునిచ్చారు. నరేంద్ర మోదీ దేశంలోని ప్రాంతీయ పార్టీలను ఈడీ, సీబీఐలతో భయభ్రాంతులకు గురిచేసి ఎన్డీఏ కూటమి వైపు తిప్పుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని, జనసేన పార్టీని నరేంద్ర మోదీ భయపెట్టి తన వైపు తిప్పుకున్నాడని అన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, నియోజకవర్గ కార్యదర్శి సత్యనారాయణ రాజు, ఉప్పలపాటి వెంకయ్య, వైదన వెంకట్ పాల్గొన్నారు.

జనసేన విశాఖ సౌత్ అభ్యర్థిగా వంశీకృష్ణ యాదవ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జనసేన విశాఖ సౌత్ అభ్యర్థిగా వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పేరును ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. ఇంకా పెండింగ్‌లో ఉన్న పాలకొండ, అవనిగడ్డ అసెంబ్లీ స్థానాలపై ఆ పార్టీ కసరత్తు చేస్తోంది. వంశీకృష్ణ యాదవ్ వైసీపీ నుంచి జనసేనలో చేరారు. వైసీపీలో ఉన్నప్పుడు ఆయన ఎమ్మెల్సీ పదవిని పొందారు. అంతరం జనసేనలోకి చేరడంతో ఆయనపై అనర్హతవేటు వేయాలంటూ శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషెన్ రాజుకు వైసీపీ ఫిర్యాదు చేసింది. ఇటీవల మచిలీపట్నం లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించిన వల్లభనేని బాలశౌరి కూడా వైసీపీ నుంచి ఎంపీగా గెలిచి, చివరి దశలో ఆయనకు తిరిగి టికెట్టు దక్కే అవకాశాలు లేనందున జనసేనలోకి చేరారు. పెండింగ్‌లో ఉన్న అవనిగడ్డ, పాలకొండ అసెంబ్లీ స్థానాల్లో జనసేన అభ్యర్థుల ప్రకటన ఆ పార్టీకి పెద్ద తలనొప్పిగా మారింది. ఒకే నియోజకవర్గం నుంచి ఇద్దరు ముగ్గురు టికెట్లు ఆశిస్తున్నప్పటికీ, వారిలో ఎవరికీ గెలుపు అవకాశాలు లేకపోవడంతో జనసేన తర్జనభర్జన పడుతోంది.

పోడు భూముల రగడ

శాంతింపజేసేందుకు యత్నం... సీఐను వెంబడించిన గిరిజనులు

విశాలాంధ్ర బ్యూరో-ఖమ్మం: పోడు భూముల విషయమై రెండు గిరిజన వర్గాల మధ్య ఏర్పడిన ఘర్షణను శాంతింపజేసేందుకు యత్నించిన సీఐపై ఓ వర్గం దాడికి తెగబడింది. తప్పించుకునేందుకు ప్రయత్నించినా వెంటపడి మరీ దాడి చేశారు. వివరాలివి. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని ఏజెన్సీ గ్రామమైన చంద్రాయణపాలెం సమీపంలో 25 ఎకరాల పోడు భూముల వ్యవహారంలో గిరిజనతెగలోని రెండు వర్గాల మధ్య ఆదివారం గొడవ జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. చాంద్రాయణపాలెం-బుగ్గపాడు గ్రామాల గిరిజనుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో సత్తుపల్లి సీఐ కిరణ్ తన సిబ్బందితో వెళ్లి ఇరు వర్గాలకు సర్దిచెప్పి ఘర్షణ వాతావరణాన్ని శాంతింపచేసే ప్రయత్నం చేశారు. అందులో ఓ వర్గం సీఐను లక్ష్యంగా చేసుకొని దాడికి ప్రయత్నించారు. పోలీసు సిబ్బంది తక్కువగా ఉండటంతో గిరిజనులను అదుపు చేసేందుకు వారిపై లాఠీచార్జికి చర్యలు తీసుకోలేదు. ఒక దశలో సీఐ వారి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించగా మహిళలతో సహా కొందరు గిరిజనులు వెంటపడి సీఐపై దాడికి పాల్పడ్డారు. సత్తుపల్లి ఏజెన్సీ గ్రామాల్లో జరిగిన ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తవాతావరణం ఏర్పడింది. పోడు భూముల వ్యవహారంలో ఆయా గ్రామాలకు చెందిన గిరిజనుల్లోని రెండు వర్గాల మధ్య విభేదాలు చాలాకాలంగా కొనసాగుతున్నాయి. గతంలో ఘర్షణపడిన సందర్భాలు ఉన్నాయి. కాగా, పోలీసులపై గిరిజనులు తిరగబడి దాడి చేసే స్థాయికి రావడంతో ఉన్నతాధికారులు తదుపరి చర్యలకు ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.

కాంగ్రెస్‌లోకి కడియం శ్రీహరి

కారు దిగిన రెండో ఎమ్మెల్యే

విశాలాంధ్ర-హైదరాబాద్: మూడు రోజులుగా నడుస్తున్న డ్రామాకు తెరపడింది. బీఆర్ఎస్ స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కూతురు కడియం కావ్య ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో వారు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అయితే కడియం కావ్యకు వరంగల్ ఎంపీ టికెట్‌ను గులాబీ బాస్ కేటాయించగా ఆమె పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు కేసీఆర్‌కు లేఖ రాసిన విషయం తెలిసిందే. తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగుతున్న తన కూతురిని ఓడిపోయే పార్టీ తరఫున పోటీ చేయించదలుచుకోలేదని శ్రీహరి ఇప్పటికే స్పష్టత ఇచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశిస్తున్న వారికి ఎంపీ టికెట్ వస్తుందా లేదో వేచి చూడాలి. ఇదిలా ఉండగా, వారి రాకను స్టేషన్ ఘనపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వ్యతిరేకిస్తున్నారు. వారందరినీ తమదారిలోకి ఎలా తెచ్చుకుంటారో వేచిచూడాలి.

సాహితి

అవలోకనం...

పుట్టుక మొదలు గిట్టే వరకూ
ఎంతో కొంత
మనల్ని మనం ప్రేమించుకుంటూ వుండాలి

ఆకాశం నుంచి రాలిన
వర్షపు చినుకులు
పుడమిని ముద్దాడినట్టు
ఎటు నుంచి ఎక్కడికో ప్రయాణం

ఏ ఆశలు ఆశయాలు లేకుండా
ఏ భయాలు బాధ్యతలూ ముడేసుకోకుండా
స్వాతిముత్యంలా వచ్చి వుండవచ్చు

సృష్టికి ప్రతిసృష్టినీ ఆకాంక్షిస్తూ
కాలగమన క్రియవై
రాత్రిని నిశబ్దంగా వొదిలి
కొత్త ఉదయాలను తొడుక్కోక తప్పదు

బతుకెప్పుడూ యుద్ధమే
ఆయుధాన్ని చేపట్టి
రణరంగంలో దూకినప్పుడు
పోరాటమూ తప్పదు గాయాలు తప్పవు
జయాపజయాలు కాలానికి వొదిలేయ్యాలి
దుఃఖపు ఘోషలో
తల్లడిల్లిన దేహానికి తడి ఎప్పటికీ ఆరదు
కొన్ని క్రతువుల పాదముద్రలు
ఏ అలజడి తుఫానుకూ చెరిగిపోవు
కొన్ని గాయాలకు లేపనాలుండవు
కాలమే కరిగి వెన్నెపూసై
బాధపై చల్లగా జారిపోతుంది

అందమైనా... వికృతమైనా
గుండెను జండాలా ఎగరేసుకుంటూ
కొన్ని కళల్ని మరికొన్ని కలల్ని పోగేసుకుని
మన చుట్టూ ఆకట్టుకున్న ప్రకృతిని
మనల్ని చుట్టుకున్న ఆకృతిని
పోయే వరకూ ఆరాధించక తప్పదు..!

డా. కటుకోర్ద్వుల రమేష్
సెల్: 9949083327

కొడిగట్టిన కులవృత్తి దిగులైపోయిన కవిత్వం



కులవృత్తులు తరతరాల సంప్రదాయాల లోగిళ్లు. పల్లెలకు పట్టుకొమ్మలు. మనుషుల మధ్య ఆత్మీయతావారధులు. మనిషి మనుగడకు సోపానాలు. శ్రమజీవులకు జీవనాధారాలు. బహుజనుల పాలిట శరత్తులు. వాటిని చిన్నాభిన్నం చేసేస్తున్నాయి, కనుమరుగు చేసేస్తున్నాయిఇప్పటి కాలపరిస్థితులు. అవి అసలైన నాగరికతకు ఆనవాళ్లు. అయితే మనకళ్లముందు కనిపిస్తున్న విషాదం... అవి క్రమక్రమంగా ప్రపంచీకరణ అనకొండ కోరల్లోకి వెళ్లిపోతుంటే నిస్సహాయంగా చూస్తూ కునారిల్లుతూ గొల్లుమంటున్న మన పల్లెలు. కులవృత్తుల ధ్వంసంతో తరతరాల వారసత్వం బీటలు వారుతూ జనజీవన విధ్వంసానికి దారితీస్తోంది. ఆ విధ్వంసం అనుబంధాలకు చిచ్చుపెడుతోంది. ఒకప్పుడు పగ్గాలు చేపట్టి అల్లికలతో వస్త్రాలను కళకళలాడించిన మగ్గాలు నేడు మూలన పడిపోయి మౌనంగా రోదిస్తున్నాయి. ఒకప్పుడు మట్టిలో మహారూపాలు సృష్టించిన మట్టిచేతులు ఇప్పుడు వెట్టిచాకిరీకి అంకితమైపోతున్నాయి. అయినా కులవృత్తుల్ని వదులుకోలేని కొన్ని జీవితాలు గాలిలో మినుకుమినుకుమనే దీపాల వత్తుల్లా భారంగా గడుపుతున్నాయి. కొడిగట్టిన దీపాలైపోతున్న కులవృత్తుల్ని మళ్లీ నిండుగా వెలిగించాలని కవిత్వమూ తపిస్తోంది. అవి కొడిగట్టడానికి కారణమయ్యే ప్రచండ గాలులపై అది ధ్వజమెత్తుతోంది. మోడువారిన మనిషి జీవనోద్యానాన్ని మళ్లీ కులవృత్తి పచ్చదనంతో నింపడానికి అది సమాయత్తమవుతోంది. అందుకు తానే కులవృత్తి అయిపోయింది.

'అది బువ్వకుండ/ఆకాశంలోని శూన్యాన్ని/ముక్కలుగా కత్తిరించి
సుట్టువార మట్టిగోడలు కట్టి/సృష్టించిన గుండెకాయ
ఆహార తయారీకి ఆయువు
జీవనవికాసానికి తొలి పనిముట్టు/మానవయానానికి అడుగు
ఎప్పటికీ అస్తమించని సూర్యమడుగు.....
విశ్వమానవుల ఆకలి తీర్చ
బువ్వకుండ అందించే వారసత్వం
ఒక పరపరాగ ధర్మసందర్భం
సృష్టిరహస్యం ఎంతటి మార్మికతో
కుండ సృష్టి అంతటి క్రియాత్మకత
మట్టిచేతుల నుంచే మహాపాత్రలకు
మట్టిలోనే జీవం పొయ్యడం ఒక ఆవశ్యకత....
కుమ్మరి మన్ను ఒక చరిత్ర పరిమళం
కుమ్మరి కూడా ఒక మహత్తర బాండం
మరి బ్రహ్మ పరిస్థితి ఏమిటి
మట్టిలో కుమ్మరిపురుగై తిరిగిన ఆయన
బూడిదలో బూడిదై మెదిలిన ఆయన కాయం
ఇప్పుడు ఇచ్చుకపోతున్న బోనం....
మట్టి మహిమ స్థానంలో స్టెయిన్ లెస్ స్టీల్
కుండల స్థానంలో కుక్కర్ విజిల్లు
మట్టిని లోహం పురాగా మింగింది
అయినా మన్ను పరిమళం మిగిలేవుంది
కళాత్మకతలో ఉత్పాదకత దాగివున్న కులకాశ్పి
చేతివేళ్లనుంచే ఆణిముత్యాల్లాంటి
కుండలు గురుగులు గూనలు రాలిపడుతాయి....
ఉత్పత్తిసేవలు ఒక సామాజిక సన్నివేశం
సమాజానికి బహుజనులు అందించిన బహుమానం
తరతరాలుగా కొనసాగుతున్న వారసత్వం....

('బువ్వకుండ' దీర్ఘకవిత నుంచి)

అంటూ మట్టికీ, మనిషికీ అవినాభావ సంబంధాన్ని ఏర్పరచే కుండను సృష్టించే కుమ్మరి విభిన్న జీవనపార్శ్వాలను కవిత్వీకరించాడు అన్నవరం దేవేందర్. కులవృత్తి అతని చేత చేయించే అద్భుతాలను ఏకరువు పెట్టింది కవిత్వం. అతని వృత్తికి కలిగించే ఆటంకాలు సృష్టించే జీవనవిధ్వంసంలోని విభిన్న కోణాల్ని స్పృశించింది. మనిషికి ఆకలి తీర్చే కుండ కోసం ఆకాశమంత శూన్యాన్ని ముక్కలుగా కత్తిరించే శ్రమను చూపిస్తుంది. కుండ వని, జీవనవిధానంలో భాగమైపోవడాన్నీ, అది మానవ నాగరికతలో అడుగు అయిపోవడాన్నీ, అది మట్టి అనే జీవంతో నిండుగా తొణికిసలాడడాన్నీ, ఆ పనిముట్టు జీవనావసరం వంటి గుండెకాయ అయిపోవడాన్నీ గుర్తుచేస్తుంది. మట్టిపరిమళాన్ని లోహపు కబంధ హస్తాలు స్టెయిన్ లెస్ స్టీల్, కుక్కర్ ల కూపంలో కమ్మేయడాన్నీ దునుమాడుతుంది. అయినా ఎప్పటికీ తరిగిపోని మట్టిపరిమళాన్ని ఆస్వాదిస్తూనే వుండాలని, సమాజం కోసం ఉత్పత్తిగా మారే చేతివేళ్లు సృష్టించే కళను పదిలపరచుకోవాలని ప్రబోధిస్తుంది. విధ్వంసానికి గురైన ఆ శ్రమజీవి లోగిలిని మట్టిఊపిరితో నింపాలని తపిస్తుంది.

'కులవృత్తుల మైదానంలో/ప్రపంచీకరణ మృత్యుక్రీడ
మా నిస్సహాయత దేహపు శవంపై
రంగుతో రాగాలు కట్టి మా జీవన సంస్కృతిని దోచుకుంది
దాని నీలినీడల దుప్పటి కింద/తాటి కవలపిల్లలు
మొలకల్లోనే 'భ్రూణహత్యలు' కాబడుతున్నాయి
ప్రపంచీకరణ విధ్వంసకాండకు/వృత్తుల జాబితాలో గీత
రెక్కలు తొలుచుకుంటున్న నగ్నవృక్షం
గీతకార్మికుడు కొలువు జారి
ముందువరసలో నిలబడిన నిరుద్యోగి
పట్టణీకరణమనే/కాంక్రీట్ జంగిల్ భవనాల పునాదుల్లో
ఈదులన్నీ సమాధులు కాబడ్డాయి
రింగ్ రోడ్డు వామనపాదాల విఫణివీధిలో
చెరిపి బతికి తొక్కబడుతున్న బలిచక్రవర్తి 'మా తాటివనం'
రియల్ ఎస్టేట్ డేగల పడగల కింద
వనం మట్టిదేహం తొలచబడి
బతుకు బీడైన/మా గీత కార్మికుడు 'ఓ శిబిచక్రవర్తి'....
సృజనాత్మకంగా/వృత్తినైపుణ్యం పండించిన
మా గీత పనిముట్లన్నీ అటకెక్కిన
పాతగోతాము మూటలో చేర్చాం
వాటితో పాటు మా ఆత్మల్ని కూడా మూటగట్టాం....
రాజ్యం మాకు మిగిల్చిన వారసత్వం
చెట్టునుంచి వలస/వృత్తినుంచి వలస
వూరునుంచి వలస/బతుకునుంచే వలస....
వృత్తి ప్రతి ఒక్కరి ఆర్థికమూలం
అత్మసంతృప్తి/ఆత్మగౌరవం సొంత అస్తిత్వం!'

('కల్లంచుల బువ్వ' దీర్ఘకవిత నుంచి)

అంటూ బువ్వ పెట్టే తల్లిలాంటి కల్లుగీత వృత్తి విధ్వంసక దృశ్యాలను కవిత్వీకరిస్తాడు ఈ. రాఘవేంద్ర. ఇక్కడ ప్రపంచీకరణ విధ్వంసకాండలో తరతరాల సంస్కృతిచిన్నాభిన్నమైపోయి పగుళ్లు దీసే కల్లుగీత వృత్తి దిగులు అయిపోయింది కవిత్వం. ఆ విధ్వంసంలో తాటిఈత మొలకల భ్రూణహత్యల్నీ, సర్వస్వం కోల్పోయి చెట్టు బోసిపోవడాన్నీ, కల్లురాజసంతో ఉట్టిపడిన గతవైభవపు కొలువు జారిపోతే గీతకార్మికుడు రోడ్డునపడ్డ నిరుద్యోగి అయిపోవడాన్నీ, కార్పొరేట్ రోడ్ల వామన పాదాల కింద తాటివనాల బలిచక్రవర్తులు అణగిపోవడాన్నీ దర్శిస్తుంది. రియల్ ఎస్టేట్ స్వైరవిహారంతో బీళ్లుపడిన తమ తాటివనాల బతుకులతో శిబిచక్రవర్తులయ్యే గీత కార్మికుల ఆవేదనను రికార్డు చేసింది.

నిరంతరం చూపించే సృజనాత్మకత, వృత్తి నైపుణ్యం పనిముట్లతో బాటు అటకెక్కిపోతే ఉసూరుమంటూ తమ ఆత్మల్ని కూడా మూటగట్టి అటకెక్కించేసిన ఆ శ్రమజీవుల దుర్భరస్థితిని మనకళ్లముందుంచుతుంది. తరతరాల వారసత్వం జీవితంనుంచే వలస వెళ్లిపోయే దయనీయస్థితిని చూపుతుంది. దేహంలో అంగంలా మనిషి జీవితంలో అంతర్భాగమైపోయిన కులవృత్తి అతని ఆత్మసంతృప్తికీ, ఆత్మగౌరవానికీ, అస్తిత్వానికీ ప్రతీక అయిపోయింది. అందుకే కవిత్వం దానికి ఆత్మీయ నేస్తమైపోయింది. తన అక్షరాల ఓదార్పును వొంపుతూ దాని దిగులు తీర్చడానికి, అది పురాజ్ఞాపకంగా మిగిలిపోకుండా ఆ వైభవాన్ని మళ్లీ మనిషి జీవితానికి తొడగడానికి యత్నిస్తుంది.

డాక్టర్ కొత్వాలు అమరేంద్ర
సెల్: 9177732414



'ఈ' కాలపు యుద్ధం

రాజులు యుద్ధాలు చేసినప్పుడు
రక్తపాతంతో పాటు
రాజ్యాలు కోల్పోవటం, లేదా
కొత్త రాజ్యాలు ఆక్రమించటం
చరిత్ర కళ్లల్లో నిక్షిప్తమైన
వాస్తవ వర్ణచిత్రాలు
రాజ్యాలు అంతరించాయి
రాజులూ కనుమరుగయ్యారు

ఇప్పుడు ప్రజాస్వామ్యం
కొత్త నేత్రమైంది
అయినా, దృశ్యాలూ మారలేదు
వాటి రంగులూ మారలేదు
ప్రజల్లోంచిప్పుడు
కొందరు నాయకులు
పాలనా పాదుకి పుష్పించిన
పారిజాత పుష్పాల్లా తళుక్కుమంటున్నారు
'నేనే' పాలన చేయాలన్న
బలమైన రాజ్యకాంక్ష
పాత నీటిని గెంటేసి
కొత్త నీరొచ్చినట్టు
పునరావృతమైంది

వర్తమాన మకుటంలాగ
కేంద్ర బిందువులోంచొక పుష్పం
చక్రవర్తయి చక్రం తిప్పుతుంది
చుట్టూరా సామంతరాజులు
భిన్న వర్ణాలతో ప్రకాశమౌతారు
చక్రవర్తి ఆలోచనా ధోరణి
నచ్చని సామంతుడు తలెగరేస్తే
వాడి మెడ మీదికి, ఆంక్షల చురకత్తి
చూపు, రక్తవర్ణమై నిలుస్తుంది
తల నరికి, సామంత రాజ్యాన్ని
గుప్పిట బిగించుకోవటానికి
వేగుల మంత్ర మందిరంలో
రహస్య మంతనాలు, కొత్త
ఆలోచనలకి జీవం పోస్తాయి

చక్రవర్తి, సామంతుల నడుమ
మాటల యుద్ధం
తారాస్థాయికి చేరుతుంది
ఒకరిపై ఒకరు
నిందారోపణల అస్త్రాలు
కసిగా సంధించుకుంటారు.
ఒక్కోసారి మానవత్వం కూడా
నేలకు కూలి, మట్టి కరుస్తుంది
ఎన్ని అవాంతరాలు ఎదురైనా
మరెన్ని అవతారాలెత్తయినా సరే
సామంత రాజ్యంలో
తన జెండా ఎగురవేయాలన్న తపన
రాజాధిరాజుకి
జీవితాశయమౌతుంది
ఒక్కటి గమనించాలిక్కడ
జయాపజయాల సంఘర్షణలో
సామాన్య ప్రజానీకమే సైనికులు
ఏ కాలమైనా, సైనికులే కీలకం!

ఎస్.ఆర్.పృథ్వి, 9989223245

స్ఫూర్తి కందివనంకు కందికొండ పురస్కారం-2023

నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక నిర్వహించిన కందికొండ రామస్వామి స్మారక పురస్కారం 2023 హైదరాబాద్‌కు చెందిన కథా రచయిత్రి స్ఫూర్తి కందివనం రచించిన డిమ్కి కథల సంపుటిని ఎంపిక చేసినట్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వనపట్ల సుబ్బయ్య, పి. వహీద్‌ఖాన్‌లు తెలిపారు. ఏప్రిల్ 21.04.2024 ఆదివారం రోజున నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగే సభలో కందికొండ రామస్వామి స్మారక పురస్కారం-2023 ప్రదానంతో పాటు పదివేల నగదు, శాలువా మెమెంటోతో, సత్కరించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

వనపట్ల సుబ్బయ్య, పి. వహీద్‌ఖాన్
అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి
9492765358, 9441946909

అటల్ నుంచి మోదీ దాకా 'కాషాయ తుపాను'

మీడియా సమాజానికి దర్పణం అనుకుంటే సమాజ గమనం ఆ దర్పణంలోకి పరావర్తం కావడానికి కారకులు పత్రికా రచయితలే. వ్యవస్థలోని సర్వాంగాలనూ దగ్గర నుంచి చూసి రికార్డు చేసే పత్రికా రచయితలకూ సొంత అభిప్రాయాలు, సిద్ధాంతాలూ ఉంటాయి. తాము పని చేసిన కాలంలోని పరిణామాలపై వారికి ఒక నిర్దిష్ట దృక్కోణం ఉంటుంది. ఆ దృక్పథాన్ని దైనందిన వృత్తినిర్వహణలో నమోదు చేయక పోవచ్చు. ఒకవేళ చేసినా తమ సొంత వైఖరిని పత్రికారచనలో ప్రతి బింబించే అవకాశం ఉండకపోవచ్చు. అలా తమ మదిలో నిలిచి పోయిన ఘటనలలో ముఖ్యమైన వాటిని ఏరి ఒక దండలా గుచ్చి తమ అనుభవాలను, వార్తా కథనాల వెనక ఉన్న పరిణామాలను రికార్డు చేయడానికి కొంతమంది జర్నలిస్టులు రచయితలుగా మారిపోతారు.

సృజనాత్మక శక్తి ఉన్న పత్రికా రచయితలు తాము వృత్తిధర్మంగా రాసిన రాతలను మించిన విశేషాలను ఇలాంటి గ్రంథాలలో నిక్షిప్తం చేయవచ్చు. కొంతకాలం వినోద్ మెహతా సంపాదకత్వంలోని "ఔట్ లుక్" పత్రికలో పొలిటికల్ ఎడిటర్‌గా పనిచేసిన సబా నఖ్వీ మంచి రచయిత్రి కూడా. ఇంతవరకు ఆమె "కాపిటల్ కాంక్వెస్ట్", "పొలిటికల్ జుగాడ్: ది కోయిలిషన్ హ్యాండ్ బుక్", "ఇన్ గుడ్ ఫెయిత్", "మై ఆల్ఫాబెట్ స్టోరీ", "మై డైలీ రొటీన్" గ్రంథాలు వెలువరించారు. "షేడ్స్ ఆఫ్ సాఫ్రాన్" గ్రంథం నఖ్వీ 2018లో వెలువరించారు. ఆ తరవాత పరిణామాల ప్రేరణ కారణంగా ఆ గ్రంథాన్ని మరింత పరిపుష్టం చేసి "సాఫ్రాన్ స్టార్మ్" అని ఇటీవలే మరో గ్రంథం వెలువరించారు. ఈ రెండింటిలో వస్తువు ఒకటే అయినా అటల్ బిహారీ వాజపేయి, లాల్ కృష్ణ అద్వానీకాలం నాటి బీజేపీ ప్రస్తుతం నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీలో కొట్టొచ్చినట్టు కనిపించే మార్పులను చేర్చారు. సాధారణంగా ఒక రచన పునర్ముద్రణ అంటే పెద్ద మార్పులు ఏమీ లేకుండానే ప్రచురిస్తారు. కొంతమంది రచయితలు అనివార్యం అనుకుంటే కొన్ని మార్పులూ చేయవచ్చు. కానీ సబా నఖ్వీ ఏకంగా షేడ్స్ ఆఫ్ సాఫ్రాన్ గ్రంథంలో కొత్త సరంజామా చేర్చడంతో సరిపెట్టుకోకుండా "సాఫ్రాన్ స్టార్మ్" గా పేరే మార్చేశారు.

విధి నిర్వహణలో భాగంగా సబా నఖ్వీ ఎక్కువగా బీజేపీ వ్యవహారాల వార్తలే ఎక్కువగా రాశారు. అంటే బీజేపీ రాజకీయాల



క్రమోన్నీలనాన్ని నిశితంగా పరిశీలించే అవకాశం ఆమెకు వచ్చింది. ప్రస్తుతం ఆమె వివిధ పత్రికలకు వ్యాసాలు రాస్తారు. టీవీల్లో, యూట్యూబ్ చానళ్లలో రాజకీయ చర్చా కార్యక్రమాలలో పాల్గొంటూ ఉంటారు. మంచి రాజకీయ విశ్లేషణాశక్తిగల వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు.

భారతీయ జనసంఘ్‌గా ఉన్న సమయంలో బీజేపీ అస్తిత్వం లేదు. జనసంఘ్ పేరుతో దాదాపు 27 ఏళ్లు పనిచేసిన తరవాత ఎమర్జెన్సీ పుణ్యమా అని ఇందిరాగాంధీ పోకడలను వ్యతిరేకించే క్రమంలో జనసంఘ్ 1977 ఎన్నికలకు ముందు జనతా పార్టీలో విలీనం అయి పోయింది. ఆ ముచ్చట మూడేళ్లకన్నా తక్కువ రోజుల్లోనే ముగిసింది. తరవాత జనసంఘ్ పేరు వదిలేసి వాజపేయి, అద్వానీ నాయకత్వంలో భారతీయ జనతాపార్టీ (బీజేపీ) గా అవతరించింది. మూడు దఫాలుగా మొత్తం ఆరేళ్ల పైచిలుకు కాలం బీజేపీ తరఫున ప్రధానమంత్రిగా పనిచేసిన వాజపేయికి, ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి పోలికే లేదంటారు నఖ్వీ. ఇద్దరి వ్యక్తిత్వాలు, వ్యవహార సరళిలో మార్పు తీరును నఖ్వీ సవిమర్శక దృష్టితో రికార్డు చేశారు. నిరపేక్షంగా రాయడం ఆమె ప్రత్యేకత. వాజపేయి నాయకత్వంలో మూడు సార్లు బీజేపీ ప్రభుత్వం ఏర్పడినా ఆ పార్టీకి సంపూర్ణమైన మెజారిటీ ఎన్నడూ లేదు. మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన రెండు దఫాలు బీజేపీకి పూర్తి మెజారిటీ ఆధారంగానే ప్రభుత్వం నిర్వహిస్తున్నారు. 2014లో కన్నా 2019లో బీజేపీ సొంత కాళ్ల మీద బలంగా నిలబడగలిగిన మెజారిటీ సంపాదించింది. వాజపేయి నాయకత్వంలో అయిదేళ్లు నిరాటంకంగా కొనసాగినప్పుడు ఆ ఐక్య కూటమిని ఎన్.డి.ఎ. అనే వారు. సంకీర్ణ ప్రభుత్వాన్ని నడపగల నైపుణ్యం ఉన్న వ్యక్తిగా వాజపేయి గుర్తింపు పొందారు. ఇప్పటికీ మోదీ నడుపుతున్నది సాంకేతికంగా ఎన్.డి.ఎ. ప్రభుత్వమే. కానీ 2019లో మరింత మెజారిటీ సాధించిన తరవాత ఎన్.డి.ఎ. ప్రభుత్వం అని ప్రస్తావించడమే మానేశారు. అందరూ బీజేపీ ప్రభుత్వం అనే అంటున్నారు.

మొదటి దఫా ప్రధాని అయినప్పుడు ప్రాంతీయ పార్టీల పాత్రను మోదీ కుదించి వేశారు. రెండోసారి అధికారంలోకి వచ్చినప్పుడు ఎన్.డి.ఎ. భాగస్వామ్య పక్షాల ఛాయే కనిపించకుండా చేశారు. ఇప్పుడు ఎంత గాంభీర్యం ప్రదర్శిస్తున్నా బొటాబొటి మెజారిటీ అయినా సాధించగలమా అన్న భయం మోదీని పీడిస్తోంది. అందుకే మళ్లీ ఎన్.డి.ఎ. నామజపం చేస్తున్నారు. ప్రతిపక్షాలు "ఇండియా" ఐక్య సంఘటన ఏర్పాటు చేసిన రోజుననే మోదీకి హఠాత్తుగా ఎన్.డి.ఎ. గుర్తుకొచ్చింది. భాగస్వామ్య పక్షాల కోపం తపన మోదీలో బహిరంగంగానే కనిపిస్తోంది.

సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపే దశ నుంచి పూర్తి మెజారిటీ ఉన్న ప్రభుత్వం నడిపే దశకు చేరుకున్న మోదీ నాయకత్వంలోని బీజేపీలో వాజపేయి నాటి ధోరణి లేశమంత కూడా కనిపించడం లేదు. బీజేపీ పరిణామం చెందినట్టే మోదీ పుణ్యమా అని అనేక ప్రతికూల పరిణామాలు వచ్చాయి. ఆధిపత్య ధోరణి అడుగడుగునా విలయ నర్తనం చేస్తోంది. వాజపేయిది, మోదీది ఒకే భావ ధార అయినా సకల విషయాలలో ఇద్దరి నడవడిక, వ్యవహార సరళిలో మార్పు ఎవరైనా గుర్తించగలరు. ఇద్దరు బీజేపీ ప్రధానమంత్రుల భిన్న ధోరణిని, వ్యక్తిత్వాల్లో తేడాను రూపు కట్టించడంలో సబా నఖ్వీ నైపుణ్యం "సాఫ్రాన్ స్టార్మ్" నిండా ప్రతి పేజీలో పరుచుకుని ఉంది.

1998లో నఖ్వీ వార్తా సేకరణలో భాగంగా ప్రధానిగా వాజపేయి ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు. 2014లో అదే రాష్ట్రపతి భవన్ ఆవరణలోనే ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారం జరిగినా మార్పు ప్రత్యేకంగా కనిపించిందంటారు నఖ్వీ.

బీజేపీ అస్తిత్వానికి మూలభూతమైన ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తలకు బీజేపీ నాయకులకు మధ్య ఉన్న సంబంధాలలోనూ మార్పు ప్రత్యేక పరిశీలనా దృష్టి అవసరం లేకుండా చూడొచ్చునంటారు నఖ్వీ. వ్యక్తి ఆరాధనా తత్వం ప్రస్తుతం విపరీతంగా పెరిగిపోయిందని రుజువు చేయడాన్ని నఖ్వీ మరిచిపోలేదు.

ఒకప్పుడు ఇతర రాజకీయ పార్టీలు బీజేపీని అంటరాని పార్టీగా చూస్తున్నారని వాజపేయి వగచేవారు. ఇప్పుడు మోదీ తాను అజేయుడిని అనుకుంటున్నారు. ఈ మార్పు సాధ్యమైన క్రమం ఈ గ్రంథంలో కనిపిస్తుంది. మోదీ ఏలుబడిలో గత అయిదేళ్లుగా కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రతిపక్షాల మీదకు వేటకుక్కల్లా ప్రయోగిస్తున్న తీరునూ నఖ్వీ అరమరికలకు తావు లేకుండా చూపించారు. మన దేశం వైవిధ్యభరితమైందన్న భావనను పటాపంచలు చేసి సర్వాన్ని మోదీ ఎలా తన గుప్పెట్లో కేంద్రీకృతం చేసుకున్నారో కూడా నఖ్వీ నిరూపించారు. సమకాలీన చరిత్రను నిరపేక్షంగా రికార్డు చేయగలిగిన అతి కొద్ది మంది పత్రికా రచయితలలో నఖ్వీ మొదటి వరసలోనే ఉంటారు.

ఆర్వీ రామారావ్

బీజేపీ గెలిస్తే వినాశనమే...

- లోక్‌సభ ఎన్నికల్లో మ్యాచ్ ఫిక్సింగ్‌కు మోదీ యత్నం
- న్యాయంగా పోటీ చేస్తే 180 సీట్లు కూడా రావు
- ప్రజాస్వామ్య పరిరక్షణ ర్యాలీలో రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో మ్యాచ్ ఫిక్సింగ్ కోసం ప్రధాని మోదీ యత్నిస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒక వేళ బీజేపీ ప్రయత్నాలు ఫలిస్తే రాజ్యాంగం మారిపోతుందని, ప్రజలు తమ హక్కులను కోల్పోతారని హెచ్చరించారు. 'పోలీసులు, సీబీఐ, ఈడీతో భయపెట్టి, బెదిరించి దేశాన్ని నడింపించవచ్చని అనుకుంటున్నారేమో... మీరు మీడియాను కొనగలరు గానీ భారతీయుల గళాన్ని అణచివేయలేరు. ప్రజావాణిని అణచివేసే శక్తి ప్రపంచంలోనే లేదు' అని రాహుల్ ఉద్ఘాటించారు. మ్యాచ్‌ఫిక్సింగ్ ద్వారా ఈ ఎన్నికల్లో బీజేపీ గెలిచి... రాజ్యాంగాన్ని మార్చేస్తేగనుక దేశంలో ఏదీ మిగలదు. ఎటు చూసినా వినాశనమే కనిపిస్తుందని హెచ్చరించారు. ఈ ఎన్నికలు ఓట్ల కోసం కాదు దేశాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం కోసమని ఉద్ఘాటించారు. ఇండియా కూటమి అధ్వర్యంలో దిల్లీ రామ్ లీలా మైదానంలో ఆదివారం జరిగిన ప్రజాస్వామ్య పరిరక్షణ ర్యాలీలో రాహుల్ మాట్లాడుతూ బీజేపీ, ప్రధానిపై విమర్శలు గుప్పించారు. 'క్రికెట్‌లో ఎంపైర్లు, కెప్టెన్‌లను ఒత్తిడికి లోనుచేసి...ఆటగాళ్లను కొనేస్తే మ్యాచ్ గెలుస్తారు. దీనినే మ్యాచ్ ఫిక్సింగ్ అంటారు. మనం లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కోబోతున్నాం. ఎంపైర్లను ఎంపిక చేసినదెవరు? మ్యాచ్ ప్రారంభానికి ముందే ఇద్దరు ఆటగాళ్లు అరెస్టుకు గురయ్యారు. ఈ ఎన్నికల్లో మ్యాచ్ ఫిక్సింగ్ కోసం నరేంద్రమోదీ ప్రయత్నిస్తున్నారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. 400 స్థానాల్లో గెలుస్తామని బీజేపీ నినదిస్తోంది కానీ ఈవీఎంలు లేకుండా, మ్యాచ్‌ఫిక్సింగ్ చేయకుండా, విపక్ష నేతలను ఒత్తిళ్లకు గురిచేయకుండా, మీడియాను వేధించకుండా కనీసం 180 సీట్లలో గెలవగలదా అని ప్రశ్నించారు. 'కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్ష పార్టీ. దీని బ్యాంకు ఖాతాలన్నీ ఫ్రీజ్ చేశారు. ఇద్దరు ముఖ్యమంత్రులను అరెస్టు చేశారు. ఇప్పుడు జరగబోయేవి ఎలాంటి ఎన్నికలు! ముగ్గురు-నలుగురు కుబేరులతో కలిసి మోదీ మ్యాచ్ ఫిక్సింగ్ చేస్తున్నారు. పేదల నుంచి రాజ్యాంగాన్ని లాక్కునేందుకే ఇదంతా చేస్తున్నారు. రాజ్యాంగమన్నది ప్రజల వాణి... రాజ్యాంగం లేకపోతే దేశం కూడా ఉండదు... పేదలకు హక్కులు, రిజర్వేషన్లు ఉండవు' అని రాహుల్ తెలిపారు. 400 స్థానాల్లో గెలిచిన తర్వాత రాజ్యాంగాన్ని మార్చేస్తామని ఓ బీజేపీ నేత చెప్పారు....ఆయన ఆ మాటలు వారి ఆలోచనకు ప్రతిబింబమని అనంత్ కుమార్ హెగ్డే వ్యాఖ్యలనుద్దేశించి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు వ్యాఖ్యానించారు.

ఆర్‌ఎస్‌ఎస్ అజెండా అమలు కానివ్వం: తేజస్వి

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ప్రచార ఉచ్చులో చిక్కుకోవద్దని దేశ ప్రజలకు ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ సూచించారు. మోదీ హామీలు... చైనా ఉత్పత్తులు ఒక్కటే అని ఎద్దేవా చేశారు. 'మీరు మోసగాళ్ళు... వాగ్దానం చేసి మర్చిపోతారు' అని గత ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను మోదీ అమలు చేయకపోవడాన్ని ఉద్దేశించి తేజస్వి వ్యాఖ్యానించారు. దేశంలో అప్రకటిక ఎమెర్జెన్సీ ఉందని, దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ అజెండాను విప క్షాలు అమలు కానివ్వబోవని నొక్కిచెప్పారు. ఈడీ, సీబీఐ, ఐటీ శాఖలు బీజేపీ విభాగాలని దుయ్యబట్టారు. 'తన హామీ గట్టిదని మోదీ అంటారు కానీ అది చైనా ఉత్పత్తుల తరహా అని మేమంటాం. రెండు-మూడు సార్లు వాడిన తర్వాత పనిచేయదు. అలాగే ఆయన ఇచ్చే హామీలు ఎన్నికల తర్వాత వర్తించవు. బీజేపీకి ప్రచారం చేయడం, బెదిరించడమే తెలుసు' అని ఎద్దేవా చేశారు. బీజేపీ సీనియర్ నేత అద్వాణిని భారతరత్నతో రాష్ట్రపతి ముర్ము సన్మానించినప్పుడు పక్కకే ఉన్న మోదీ... రాష్ట్రపతికి గౌరవమిస్తూ కనీసం కుర్చీలో నుంచి లేవలేదన్నారు. ఈసారి 400 స్థానాలు తథ్యమన్న నినాదం వెనుక ఈవీఎంల సెట్టింగ్ ఉన్నట్లు తోస్తోందని వ్యాఖ్యానించారు. ఈ నినాదం నిజమవుతుందా లేక వారిని సాగనంపుతారా అన్నది ప్రజలకే వదిలేస్తున్నామన్నారు. తుపానులా వచ్చిన మోదీ... అదే తరహాలో నిష్క్రమిస్తారని ఇక్కడి ప్రజల వాణి చెబుతోందన్నారు. విద్వేష రాజకీయాలు, విభజన విధానాలు అమలవుతున్నాయని, ప్రజల కోసం మేమంతా ఐక్యపోరునకు నడుం బిగించామని ఆయనన్నారు. 400 సీట్లు గెలుస్తామని నినదించే వారు ఏమైనా చెప్పగలరు కానీ పాలకులను ఎంచుకునే అధికారం ప్రజల చేతుల్లోనే ఉందని ప్రజల హర్షధ్వనుల నడుమ తేజస్వి యాదవ్ ఉద్ఘాటించారు. తన తండ్రి, తల్లి, తోబుట్టువులపై కేసులను ప్రస్తావించారు. అవేమీ తమను భయపెట్టలేవని చెప్పారు. 'ఒక్క పులిని మాత్రమే బంధించారు... మేమంతా పులలమే... మేము కూడా గర్జించేందుకు... పోరాడేందుకు వెనకాడబోం' అని కేజ్రీవాల్ అరెస్టునుద్దేశించి తేజస్వి అన్నారు. బీజేపీ అబద్ధాలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటుతో తగిన గుణపాఠం చెబుతారని నమ్ముతున్నానని ఉద్ఘాటించారు. 'దేశంలో అప్రకటిత అత్యవసర పరిస్థితి ఉంది. అధికారులు నియంత పోకడలకు అలవాటు పడుతున్నారు. అహంకారులుగా మారుతున్నారు. మేము ఎవరినీ దూషించాలని అనుకోవడం లేదు కానీ వాస్తవాలను ప్రజలకు తెలియజేయడం మా బాధ్యత' అని తేజస్వి అన్నారు.

బీజేపీని సాగనంపుదాం: ఉద్ధవ్ ఠాక్రే

న్యూఢిల్లీ: బీజేపీని దిల్లీ నుంచి సాగనంపాలని, మరలా అడుగు పెట్ట కుండా చూడాలని శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే పిలుపునిచ్చారు. ఏక పార్టీ పాలన దేశానికి హానికర మన్నారు. నియంత పాలన దిశగా అడుగులు పడుతు న్నాయని, బీజేపీని గద్దె దించాల్సిందేనని ఇండియా కూటమి అధ్వర్యంలో జరిగిన లోకతంత్ర బచావో ర్యాలీలో ఠాక్రే ఉద్ఘాటించారు. 'ఎన్నికల ప్రచారం కోసం కాదు... ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడం కోసం ఇక్కడకు వచ్చాం. ఇద్దరు సోదరీమణులు పోరాడుతుంటే సోదరులు చూస్తూ ఊరుకోగలరా! మా సోదరీ మణుల కోసం వచ్చాం' అని అన్నారు. మేమే కాదు యావత్ దేశం మీకు అండగా ఉందని జార్ఖండ్, దిల్లీ ముఖ్యమంత్రుల భార్యలు కల్పనా సోరెన్ , సునీతా కేజ్రీవాల్‌నుద్దేశించి ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. హేమంత్ సోరెన్, అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడాన్ని చూసి దేశ ప్రజలు భయపడిపోతారని బీజేపీ భావిస్తేగనుక దానికి భారతీయుల సత్తా ఆ పార్టీకి తెలియదని విమర్శించారు. దేశ ప్రజలకు పోరాడటం తప్ప భయం తెలియదని నొక్కిచెప్పారు. మనకు శక్తిమంతమైన దేశం కావాలి... సంకీర్ణ ప్రభుత్వాన్ని తీసుకొచ్చి జాతి నిర్మాణానికి దోహద మవుదాం... అన్ని రాష్ట్రాలను గౌరవించే ప్రభుత్వాన్ని తెచ్చుకుందాం' అని ఠాక్రే పిలుపునిచ్చారు.

దిల్లీ సీఎంను ఎంతో కాలం బంధించలేరు

సునీతా కేజ్రీవాల్

న్యూఢిల్లీ: దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఎంతో కాలం నిర్బంధించలేరని, ఇక్కడ నిరంకుశత్వం పనిచేయదని సునీతా కేజ్రీవాల్ ఉద్ఘాటించారు. దిల్లీ 'లోకతంత్ర బచావో' ర్యాలీలో పాల్గొన్న ఆమె... ఈడీ కస్టడీలో ఉన్న తన భర్త సందేశాన్ని చదివి వినిపించారు. సునీతా కేజ్రీవాల్ రాజకీయ ర్యాలీలో ప్రసంగించడం ఇదే తొలిసారి. ఆమె మాట్లాడుతూ కేజ్రీవాల్ రాజీనామా చేయాలా అని ప్రజలను ప్రశ్నించారు. 'సీఎం కేజ్రీవాల్ రాజీనామాను బీజేపీ డిమాండ్ చేస్తోంది. ఆయన రాజీనామా చేయాలా? ఆయన అరెస్టు న్యాయమైనదేనా? అని ప్రశ్నించారు. కేజ్రీవాల్ పులిలాంటి వారని, ఆయనను ఎక్కువ కాలం చెరశాలలో బంధించలేరని నొక్కిచెప్పారు. 'నా భర్తకు మీ అందరి ఆశీస్సులు ఉన్నాయి. అందుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నా' అని అన్నారు. 75ఏళ్లలో దిల్లీ ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని, వారి ప్రభుత్వం కుంటుపడిందన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే దిల్లీని సంపూర్ణ రాష్ట్ర హోదా కల్పిస్తామని హామీనిచ్చారు. కేజ్రీవాల్ సందేశంలో భాగంగా ఇండియా కూటమి తరపున ఆరు హామీలిచ్చారు. నిర్విరామ విద్యుత్ సరఫరా, పేదలకు ఉచిత విద్యుత్, ప్రభుత్వ బడులు, మొహల్లా క్లినిక్‌లు, మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు, రైతులకు కనీస మద్దతుధర, దిల్లీకి రాష్ట్ర హోదా అందులో ఉన్నాయి. ఇండియా కూటమికి అవకాశమిస్తే గొప్పగా జాతినిర్మాణం జరుగుతుందని సునీతా కేజ్రీవాల్ తన భర్త తరపున వాగ్దానం చేశారు. దేశ ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా లేక చికిత్స అందక ప్రాణాలు పోతుండటంతో భారతమాత బాధలో ఉన్నదన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకే ఓటేయండి: అఖిలేశ్

న్యూఢిల్లీ: ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఓటు వేయాలని ప్రజలకు సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ పిలుపునిచ్చారు. దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుతో యావత్ ప్రపంచం బీజేపీని విమర్శిస్తోందన్నారు. ప్రతిపక్షాలే లక్ష్యంగా దర్యాప్తు సంస్థలను కేంద్రప్రభుత్వం దుర్వినియోగిస్తోందని దుయ్యబట్టారు. బీజేపీకి ఓటమి భయం పట్టుకున్నదని విమర్శించారు. విపక్ష నేతలంతా దిల్లీకి చేరుకుంటే... ప్రధాని మోదీ దిల్లీ నుంచి వెళ్లిపోయారని, దీనితో అధికారానికి దూరమ య్యేది ఎవరో తేలిపోయిందని ప్రధాని మీరట్ ర్యాలీని ఉద్దేశించి అఖిలేశ్ వ్యాఖ్యానించారు. 'ఇది కొత్త ఆవిష్కరణ. ఈడీ, సీబీఐ, ఐటీని రంగంలోకి దించి... ఎంత కావాలంటే అంత దండుకోవచ్చు' అని ఎన్నికల బాండ్ల పథకాన్ని ఎద్దేవా చేశారు. 'నిన్న హేమంత్ సోరెన్, నేడు అరవింద్ కేజ్రీవాల్‌ను జైలుకు పంపారు. ప్రతిపక్ష నాయకులు అందరిపైనా ఆరోపణలు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ లూటీ... అవినీతిపై చర్యలు తీసుకునే పరిస్థితి ఉంటుందా? అని అఖిలేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 400 స్థానాల్లో గెలుస్తామన్న దీమా ఉంటే ఆమ్ ఆద్మీ పార్టీ నేతలంటే ఎందుకంత భయమని బీజేపీకి చురకలు అంటించారు. విరాళాల కోసం ఈడీ, సీబీఐని ఇష్టమొచ్చినట్లు వాడుకుంటోందని దుయ్యబట్టారు. బీజేపీ కుయుక్తులు, జిత్తులు దేశానికి తెలుసన్నారు. తమ అవినీతిబాగోతం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే విపక్ష నేతలపై కేసులని అఖిలేశ్ విమర్శించారు. బీజేపీని గద్దె దించాలని, ఇండియా కూటమిని గెలిపించాలని నొక్కిచెప్పారు. 'వాళ్లను (బీజేపీ) ఓడించండి... ఇంటికి పంపండి. మీ ఓటు దేశాన్ని కాపాడగలదు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను పరిరక్షించగలదు. పీడీఏ (వెనుకబడిన, దళితులు, అల్ప సంఖ్యాకులు)ను కాపాడుకునేందుకు అవసరమైన చర్యలకు దోహదం కాగలదు' అని అఖిలేశ్ పిలుపునిచ్చారు.

బీజేపీది నిరంకుశత్వాన్ని సాగనివ్వం: చంపై సోరెన్

బీజేపీది నిరంకుశత్వమని, దాని సిద్ధాంతాన్ని వ్యాప్తి చెందనివ్వమని దిల్లీ ర్యాలీలో జార్ఖండ్ ముఖ్యమంత్రి చంపై సోరెన్ ఉద్ఘాటించారు. మాజీ సీఎం హేమంత్ సోరెన్ దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల కోసం ఎంతో చేశారు కాబట్టే బీజేపీ అసౌకర్యానికి గురైందని, ఎలాంటి ఆధారాలు లేకుండా ఆయనను జైలుకు పంపిందని వ్యాఖ్యానించారు. 'మేమంతా ఒక్కటి... బీజేపీ నిరంకుశత్వాన్ని, దాని సిద్ధాంతాన్ని దేశంలో వ్యాప్తి చెందనివ్వం. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఏకతాటిపైకొచ్చాం. ప్రజాస్వామ్య పరిరక్షణ ర్యాలీ ద్వారా ప్రజల్లోకి ఐకతా సందేశం వెళుతుంది' అని చంపై సోరెన్ నొక్కిచెప్పారు.

ఎన్నికల రాజకీయాలు చేయబోం

రైతు సంఘాల స్పష్టీకరణ

న్యూఢిల్లీ: రైతు సమస్యల పరిష్కారానికి ఎన్నికల రాజకీయాలు దోహదపడతాయని భావించడం లేదని రైతుసంఘాల నాయకులు స్పష్టం చేశారు. దాదాపు మూడు దశాబ్దాల క్రితం తమిళనాడులో ప్రభుత్వ విధానాలపై అసంతృప్తితో వెయ్యి మందికి పైగా రైతులు లోక్‌సభ ఎన్నికల్లో తమ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఒక్క నియోజకవర్గం నుంచి నామినేషన్లు దాఖలు చేశారు. ఈరోడ్ జిల్లా మొదకురిచి నుండి ఊహించని విధంగా 1,033 మంది అభ్యర్థులు బరిలోకి దిగడంతో ఎన్నికల సంఘం బ్యాలెట్ పేపర్‌కు బదులుగా 'బ్యాలెట్ బుక్' ముద్రించాల్సి వచ్చింది. అయితే తమ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయేందుకు ఇటువంటి ఎత్తుగడలు మార్గమని దాదాపు రెండు నెలలుగా దిల్లీ-హర్యానా సరిహద్దులో శిబిరాలు నిర్వహిస్తున్న పంజాబ్‌కు చెందిన రైతులు భావించడం లేదు. ఈ రైతులు తమ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కు చట్టబద్ధ హామీ, వ్యవసాయ రుణాల మాఫీ తదితర డిమాండ్ల సాధన కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఫిబ్రవరి 13న 'చలో దిల్లీ' మార్చ్‌ను ప్రారంభించారు. అయితే భద్రతా బలగాలు వారిని హర్యానా సరిహద్దులో నిలువరించిన సంగతి విదితమే. అప్పటి నుండి రైతులు పంజాబ్-హర్యానా మధ్య శంభు, ఖనౌరీ పాయింట్ల వద్ద శిబిరాల్లోనే ఉండిపోయి నిరసన కొనసాగిస్తున్నారు. అఖిల భారత కిసాన్ సభ ప్రతినిధి కృష్ణ ప్రసాద్ పీటీఐతో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను ఎదిరించేందుకు రైతులు కట్టుబడి ఉన్నారన్నారు. ఇందుకోసం తాము ఎన్నికల మార్గంలో వెళ్లాలని ప్లాన్ చేయడం లేదని స్పష్టం చేశారు. బీజేపీని ఎదిరించి, దాని విధానాలను బట్టబయలు చేస్తామని దిల్లీలో జరిగిన మహాపంచాయత్‌లో తమ వైఖరిని ప్రకటించామని వెల్లడించారు. ఈ విషయంలో మేం ఐక్యంగా ఉన్నామని పేర్కొన్నారు. రాష్ట్రీయ కిసాన్ మహాసంఘ్ ప్రతినిధి అభిమన్యు కోహర్ మాట్లాడుతూ... "మేము ఫిబ్రవరి 13 నుండి సరిహద్దుల వద్ద కూర్చున్నాము. మేము ఎన్నికల రాజకీయాలకు దూరంగా ఉన్నాము. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అన్ని పార్టీలు రైతులకు మద్దతు ఇస్తాయి. అయితే అధికారంలో ఉన్నప్పుడు, వారంతా కార్పొరేట్ అనుకూలురుగా మారతారు. రైతు వ్యతిరేకులు అవుతారు' అన్నారు.

పదేళ్లలో 'కచ్చతీవు'ను వెనక్కెందుకు తీసుకోలేదు?

మోదీకి ఖర్గే సూటి ప్రశ్న

న్యూఢిల్లీ: కచ్చతీవు దీవిని మాజీ ప్రధాని ఇందిరాగాంధీ శ్రీలంకకు ఇచ్చారన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విరుచుకుపడ్డారు. అదే నిజమైతే మోదీ తన పదేళ్ల పాలనలో దాన్ని తిరిగి పొందేందుకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు సున్నిత అంశాలను ప్రస్తావించడం...ఎన్నికల్లో ఓడిపోతామన్న మోదీ నిరాశకు అద్దం పడుతోందన్నారు. 1974లో స్నేహపూర్వక ఒప్పందంలో భాగంగానే కచ్చతీవు ద్వీపాన్ని శ్రీలంకకు ఇచ్చారని, సరిహద్దు ఎన్‌క్లేవ్‌ల మార్పిడి విషయంలో బంగ్లాదేశ్ పట్ల కూడా మోదీ ప్రభుత్వం ఇదే విధమైన స్నేహపూర్వక విధానాన్ని అవలంబించిదని ఖర్గే గుర్తుచేశారు. 'ప్రధాన మంత్రి నరేంద్ర మోదీజీ... మీ 10వ సంవత్సరాల దుష్పరి పాలనలో ప్రాదేశిక సమగ్రత, జాతీయ భద్రతకు సంబంధించిన సమస్యలపై అకస్మాత్తుగా మేల్కొన్నారు. బహుశా, ఎన్నికల్లో లబ్ధి కోసం కావచ్చు. మీ నిరాశ స్పష్టంగా మీ నిరాశ స్పష్టమ వుతోంది' అని అతను ఖర్గే 'ఎక్స్' పోస్టులో పేర్కొన్నారు. 2015లో మోదీ చేసిన ప్రకటనను ఉటంకిస్తూ 'భారత్-బంగ్లాదేశ్ మధ్య భూసరిహద్దు ఒప్పందం కేవలం భూమిని మార్చడం మాత్రమే కాదు...ఇది హృదయాల కలయిక గురించి' అని ప్రధాని చెప్పారని ఖర్గే అన్నారు. తమిళనాడులో ఎన్నికల ముందు, మీరు ఈ సున్నితమైన అంశాన్ని లేవనెత్తుతున్నారని దుయ్యబట్టారు. 'కచ్చతీవు 1974లో ఒప్పందం ద్వారా శ్రీలంకకు వెళ్లింది...ఈరోజు దాన్ని ఎలా వెనక్కి తీసుకుంటారు...కచ్చతీవును తిరిగి పొందాలంటే యుద్ధానికి దిగాలి' అని 2014లో మీ ప్రభుత్వ అటార్నీ జనరల్ ముకుల్ రోహ్తగి సుప్రీంకోర్టుకు చెప్పారని గుర్తు చేశారు. 'ప్రధానమంత్రి జీ, ఈ సమస్యను పరిష్కరించి కచ్చతీవును వెనక్కి తీసుకునేందుకు మీ ప్రభుత్వం ఏమైనా చర్యలు తీసుకుందా, చెప్పండి' ఖర్గే ప్రశ్నించారు. నేపాల్, భూటాన్, మాల్దీవులతో సహా భారత పొరుగు దేశాలకు సంబంధించి ప్రభుత్వ విదే శాంగ విధానాన్ని కూడా ఖర్గే ఎత్తి చూపారు. 'మీ విదేశాంగ విధాన వైఫల్యం కారణంగా పాకిస్థాన్ రష్యా నుండి ఆయు ధాలను కొనుగోలు చేయడం చరిత్రలో ఇదే మొదటిసారి' అని ఆయన ఆరోపించారు. జాతి ఐక్యత కోసం కాంగ్రెస్ వ్యక్తి రక్తం చిందించని ఒక్క గ్రామం కూడా భారతదేశంలో లేదని అన్నారు. హింసాత్మక వేర్పాటువాద శక్తులతో విజయవంతంగా పోరాడ టానికి తమ ప్రాణాలను అర్పించిన మా నాయకులుఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ మార్గదర్శకత్వంలో కాంగ్రెస్... జాతి ఐక్యత, సమగ్రతను కాపాడిందన్నారు.

మా ఉద్యోగాలు తీసేసి వాళ్లకు ఇస్తున్నారు...

టీసీఎస్‌పై అమెరికన్ ఉద్యోగుల బృందం ఆరోపణ

న్యూఢిల్లీ: దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌పై అమెరికన్ ఉద్యోగులు తీవ్ర ఆరోపణలు చేశారు. జాతి, వయసు ఆధారంగా టీసీఎస్ తమపై చట్టవిరుద్ధంగా వివక్ష చూపుతుందని, షార్ట్ నోటీసుతో తమను తొలగించి హెచ్1బీ వీసాలపై భారత్ నుంచి ఉద్యోగులను రిక్రూట్ చేస్తోందని అమెరికన్ ఉద్యోగుల బృందం ఆరోపించింది. వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదిక ప్రకారం.. డజన్ల కొద్దీ అతిపెద్ద అమెరికన్ క్లయింట్లు ఉన్న టీసీఎస్‌కు వ్యతిరేకంగా సుమారు 22 మంది అమెరికన్ ఉద్యోగులు యూఎస్ ఈక్వల్ ఎంప్లాయ్‌మెంట్ ఆపర్చునిటీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. తొలగింపునకు గురైన టీసీఎస్ మాజీ ఉద్యోగుల్లో యూఎస్‌లోని వివిధ రాష్ట్రాల్లో నివసిస్తున్న కాకేసియన్లు, ఆసియన్-అమెరికన్లు, హిస్పానిక్ అమెరికన్లు... 40 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న వారే ఎక్కువ మంది ఉన్నారు. వీరిలో ఎంబీఏ, ఇతర ఉన్నత డిగ్రీలున్నవారూ ఉండటం విశేషం. అయితే ఈ ఆరోపణలను టీసీఎస్ ప్రతినిధి కొట్టిపారేశారు. 'చట్టవిరుద్ధమైన వివక్ష'కు సంబంధించిన ఆరోపణలు, అర్హత లేనివి, తప్పుదారి పట్టించేవి' అని తెలిపారు. "యూఎస్‌లో సమాన అవకాశాలు కల్పించే సంస్థగా టీసీఎస్ బలమైన రికార్డును కలిగి ఉంది. దాని కార్యకలాపాలలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తుంది" అని కంపెనీ ప్రతినిధి పేర్కొన్నారు.

'ఉబర్' రైడ్‌కు కోట్లలో బిల్లు!

న్యూఢిల్లీ: దిల్లీ సమీపంలోని నోయిడాలో దీపక్ తెంగురియా అనే వ్యక్తి యథావిథిగా తాను వెళ్లే రూట్‌లో ఉబర్ ఆటో రైడ్ బుక్ చేశాడు. రైడ్ తక్కువ దూరమే అయినందున రూ.62 బిల్లు చూపించింది. మామూలే కదా అని ఆటో ఎక్కి డెస్టినేషన్‌లో దిగి బిల్లు పే చేద్దామనుకునే సరికి దీపక్ అవాక్కయ్యాడు. ఏకంగా రూ.7.66 కోట్లు పే చేయాలని బిల్లు చూపించింది. దీంతో ఆశ్చర్యపోవడం దీపక్ వంతైంది. దీపక్‌కు ఇంత భారీ బిల్లు రావడానికి సంబంధించిన వీడియోను ఆయన స్నేహితుడు ఆశిష్ ఎక్స్(ట్విటర్)లో షేర్ చేశాడు. దీనిపై వీడియోలో స్నేహితులిద్దరి మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. చంద్రయాన్‌కు రైడ్ బుక్ చేసుకున్నా ఇంత బిల్లు రాదని ఇద్దరు స్నేహితులు జోకులు వేసుకున్నారు. అయితే అతి తక్కువ దూరం ఆటో రైడ్‌కు కోట్లలో బిల్లు రావడంపై ఉబర్ స్పందించింది. 'భారీ బిల్లు ఇచ్చి ఇబ్బంది పెట్టినందుకు క్షమాపణలు. మాకు కొంత సమయమిస్తే దీనిపై అప్‌డేట్ ఇస్తాం'అని ఉబర్ సందేశం పంపింది.

ఆరు నెలల్లో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు

యువకులతో రాజస్థాన్ గ్రామీణ యువతుల పోటీ

జైపూర్: రాజస్థాన్‌లోని గ్రామీణ యువతులు ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో తాము యువకులకు ఏమాత్రం తక్కువకాదని నిరూపిస్తున్నారు. కేవలం ఆరు నెలల వ్యవధిలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన కల్పన దీనికి ఉదాహరణగా నిలిచారు. రాజస్థాన్‌లోని ఫతేపూర్ షెఖావతి పరిధిలోని రినౌ గ్రామానికి చెందిన కల్పనా బిర్దా ఓ సాధారణ రైతు కుటుంబానికి చెందిన యువతి. ఆమె తొలుత సీహెచ్‌ఎస్‌ఎల్‌లో క్లర్క్ ఉద్యోగం సంపాదించింది. తరువాత ఆడిటర్‌గా ఉద్యోగం దక్కించుకుంది. ఇప్పుడు సీజీఎస్‌టీలో ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం చేజిక్కించుకుంది. కుటుంబంలోని ముగ్గురు అక్కాచెల్లెళ్లలో కల్పన పెద్దది. బనస్థలి విద్యాపీఠ్‌లో చదువు పూర్తి చేసింది. కాలేజీలో చదువుతున్నప్పుడే ప్రభుత్వ ఉద్యోగానికి ప్రయత్నాలు మొదలుపెట్టింది. కల్పన తండ్రి మహిపాల్ విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నాడు. ఆమె తల్లి పొలం పనులతో పాటు ఇంటిపనులు కూడా చేస్తుంది. కల్పన ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికకావడంతో వారి ఇంటిలో ఆనందానికి అవధులు లేకుండా పోతున్నాయి. కల్పన మీడియాతో మాట్లాడుతూ తాను పోటీపరీక్షల కోసం తొలుత దిల్లీలో కొన్ని రోజులు కోచింగ్ తీసుకున్నానని, ఆ తర్వాత ఇంట్లోనే చదువుకున్నానని తెలిపింది. చదువుతో పాటు ఎప్పటికప్పుడు రివిజన్ కూడా చేసుకునేదానినని, ఈ రివిజన్ కారణంగానే పోటీ పరీక్షల్లో విజయం సాధించగలిగానని వివరించింది.

'జ్ఞానవాపి'పై నేడు సుప్రీంలో విచారణ

న్యూఢిల్లీ: మసీదు దక్షిణ సెల్లార్‌లో హిందూ ప్రార్థనలను అనుమతించే దిగువ కోర్టు ఆదేశాలను సమర్థిస్తూ అలహాబాద్ హైకోర్టు తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా జ్ఞానవాపి మసీదు నిర్వహణ కమిటీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఏప్రిల్ 1న విచారించనుంది. ఫిబ్రవరి 26న హైకోర్టు ఇచ్చిన నిర్ణయాన్ని సవాలు చేస్తూ వారణాసి లోని జ్ఞాన్‌వాపి మసీదు వ్యవహారాలను నిర్వహిస్తున్న అంజుమన్ ఇంతేజామియా మసాజిద్ కమిటీ పిటిషన్‌ను చీఫ్‌జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జేబీ పార్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించనుంది. హిందువులు మసీదు సెల్లార్‌లో ప్రార్థనలు చేసుకోవడానికి అను మతిస్తూ జనవరి 31న జిల్లా కోర్టు ఇచ్చిన ఆదే శాలను సవాలు చేస్తూ కమిటీ వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే.

నిర్మలమ్మ ఆస్తి, అప్పుల చిట్టా...

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి కావలసినంత డబ్బు తన దగ్గర లేదని ఇప్పటికే పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేయనని, ప్రచారంలో మాత్రం పాల్గొంటానని స్పష్టం చేశారు. ఒక ఆర్థిక మంత్రి దగ్గర డబ్బు లేదు అన్న మాటలు కొందరికి ఆశ్చర్యాన్ని కలిగించినప్పటికీ అది నిజమే అని తాజాగా వెల్లడైన కొన్ని విషయాల ద్వారా తెలుస్తోంది. కేంద్ర ఆర్థిక మంత్రికి కొంతవరకు ఆస్తులు ఉన్నప్పటికీ అప్పులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. 2022లో రాజ్యసభ సభ్యురాలిగా నామినేషన్ వేసిన సమయంలో ఆమె దాఖలు చేసిన అఫిడవిట్లలో ఆస్తులు, అప్పులకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. దీని ప్రకారం ఆమె మొత్తం ఆస్తుల విలువ రూ. 2.53 కోట్లుగా ఉంది. నిర్మలా సీతారామన్‌కు ఉన్న మొత్తం ఆస్తిలో రూ.1.87 కోట్ల స్థిరాస్తులు, రూ.65.55 లక్షల విలువైన చరాస్తులు ఉన్నట్లు సమాచారం. అప్పు రూ.26.91 లక్షలు ఉన్నట్లు తెలుస్తోంది. 2016లో సీతారామన్ ఆస్తి విలువ రూ. 99.36 లక్షలు కాగా, 2022 నాటికి రూ. 1.7 కోట్లకు పెరిగింది. 2024 నాటికి ఈ ఆస్తి విలువ కొంత వరకు పెరిగి ఉండవచ్చు. 2016, 2022 డిక్లరేషన్‌ల ప్రకారం నిర్మలా సీతారామన్‌కు ఒక బజాజ్ చేతక్ స్కూటర్ ఉన్నట్లు సమాచారం. 2016లో రూ.7.87 లక్షల విలువైన 315 గ్రాముల బంగారం ఉన్నట్లు పేర్కొన్నారు. 2022 నాటికి బంగారం పరిమాణం పెరగలేదు, కానీ పెరిగిన ధరల కారణంగా ఆ బంగారం విలువ దాదాపు రెండింతలు పెరిగి రూ.14.49 లక్షలకు చేరుకుంది. ఇప్పటి ధరల ప్రకారం బంగారం విలువ రూ. 19.4 లక్షల నుంచి రూ. 21.18 లక్షల వరకు ఉంటుంది.

200 సీట్లు తెచ్చుకోండి చాలు

బీజేపీకి మమత సవాల్

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మరోసారి బీజేపీపై మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో 400కు పైగా సీట్లు గెలుస్తామని బీజేపీ చెబుతోందని, అయితే 200 మార్కును దాటాలని ఆ పార్టీకి తాను సవాల్ చేస్తున్నానని అన్నారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో బెంగాల్‌లో 200కు పైగా సీట్లు సాధిస్తామని బీజేపీ ప్రగల్భాలు పలికిందని, అయితే కేవలం 77 సీట్లకే పరిమితమయ్యారని విమర్శించారు. తల గాయం నుంచి కోలుకున్న మమతా బెనర్జీ తొలిసారి బహిరంగంగా మాట్లాడారు. టీఎంసీ అభ్యర్థి మహువా మోయిత్రాకు మద్దతుగా కృష్ణానగర్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆమె ప్రసంగించారు. బీజేపీకి వ్యతిరేకంగా గళం విప్పినందున ఆమెపై దుష్ప్రచారం చేసి లోక్‌సభ నుంచి బహిష్కరించారని అన్నారు. కాగా, పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ)ను బెంగాల్‌లో అమలు చేయడాన్ని తాను అనుమతించబోనని మమతా బెనర్జీ స్పష్టం చేశారు. సీఏఏకు దరఖాస్తు చేయడం వల్ల విదేశీయులుగా మారతారని అన్నారు. అందుకే సీఏఏ కోసం దరఖాస్తు చేయవద్దని ప్రజలను ఆమె హెచ్చరించారు. 'చట్టబద్ధమైన పౌరులను విదేశీయులుగా మార్చడానికి సీఏఏ ఒక ఉచ్చు. మేం బెంగాల్‌లో సీఏఏ, ఎన్‌ఆర్సీని అనుమతించబోం' అని అన్నారు. మరోవైపు ప్రతిపక్షాల కూటమి 'ఇండియా' బ్లాక్‌లో భాగస్వామ్య పార్టీలైన కాంగ్రెస్, సీపీఎంపై మమతా బెనర్జీ మండిపడ్డారు. "పశ్చిమ బెంగాల్‌లో 'భారత' కూటమి లేదు. బెంగాల్‌లో సీపీఎం, కాంగ్రెస్ కలిసి బీజేపీ కోసం పనిచేస్తున్నాయి" అని ఆరోపించారు.

ఢిల్లీ మద్యం కేసులో ఈడీ దూకుడు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఈ కేసుకు సంబంధించి మరిన్ని ఆధారాల్ని సేకరించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఉపయోగించిన ఐఫోన్‌ను పరిశీలించేందుకు ఐఫోన్ లాక్‌ను ఓపెన్ చేయించుందుకు ఈడీ అధికారులు ఐఫోన్ తయారీ సంస్థ యాపిల్ కంపెనీని ఆశ్రయించనున్నారు. వివిధ నివేదికల ప్రకారం లిక్కర్ కేసు విచారణ నిమిత్తం ఈడీ అధికారులు సీఎం కేజ్రీవాల్ వ్యక్తిగత ల్యాప్‌ట్యాప్, డెస్క్‌ట్యాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటితో పాటు మరో నాలుగు ఫోన్‌లను జప్తు చేశారు. ఆ సమయంలో ఫోన్‌లు స్విచ్ఛాప్ చేసి ఉన్నాయి. అయితే విచారణ సమయంలో ఆ ఫోన్‌ల పాస్‌వర్డ్‌లను చెప్పేందుకు కేజ్రీవాల్ అంగీకరించలేదు. దీంతో ఈడీ అధికారులు కేజ్రీవాల్ ఫోన్ లాక్‌లను ఓపెన్ చేయించేందుకు యాపిల్ సంస్థను సంప్రదించనున్నట్లు తెలిసింది.

మరి ఈ పదేళ్లు ఏం చేసినట్టో!

మోదీ కచ్చతీవు వ్యాఖ్యలకు జైరాం రమేశ్ కౌంటర్

బంగ్లాదేశ్ భూ ఒప్పందం ప్రస్తావన

న్యూఢిల్లీ: కచ్చతీవు అంశాన్ని ప్రధాని మోదీ ప్రముఖంగా పేర్కొనడం బీజేపీ ఎన్నికల వ్యూహమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శంచారు. ఈ పదేళ్లలో కచ్చతీవు ద్వీపాన్ని ఎందుకు తిరిగి తీసుకోలేదని ప్రధానిని ప్రశ్నించారు. అదే సమయంలో బంగ్లాదేశ్ భూ ఒప్పందాన్ని తెరమీదకు తెచ్చారు. 1974లో కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చతీవు ద్వీపాన్ని శ్రీలంకకు అప్పగించిందని మోదీ ఆరోపించారు. దీంతో 2015 నుంచి బంగ్లాదేశ్‌తో ఎన్డీయే ప్రభుత్వం చేసిన భూ సరిహద్దు ఒప్పందంలో భాగంగా 10,051 ఎకరాల భారత భూభాగం కోల్పోవాల్సి వచ్చిందని జైరాం రమేశ్ గుర్తు చేశారు. మొత్తం 17,161 ఎకరాల భారత భూభాగంలో 7,110 ఎకరాలు మాత్రమే వచ్చాయన్నారు. ఆ సమయంలో మోదీపై ఆరోపణలు చేయకుండా.. పార్లమెంటు ఉభయ సభల్లో బిల్లుకి కాంగ్రెస్ మద్దతు ఇచ్చిందని వెల్లడించారు. తమిళనాడులో ఒక్క సీటు రాకపోవడం బీజేపీ వర్గాలను కలవరపెట్టిందని విమర్శించారు. ఆ రాష్ట్రంలో దారి మళ్లింపు చర్యలను పాల్పడేందుకు ఆర్టీఐ దరఖాస్తు చేశారని దుయ్యబట్టారు. ప్రజా సమస్యలపై ఆర్టీఐ లక్షలాది ప్రశ్నలు సంధించిందని.. కానీ వాటిని పక్కన పెట్టేసి, కేవలం కచ్చతీవు సమస్యకు అధిక ప్రాధాన్యత లభించిందని, దానికి మోదీ నుంచి వేగంగా సమాధానం రావడం విడ్డూరమని జైరాం రమేశ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 1974లో సిరిమావో బండారునాయకే, ఇందిరా గాంధీ మధ్య కుదిరిన ఒప్పందం కారణంగా శ్రీలంక నుంచి ఆరు లక్షల మంది తమిళ ప్రజలు తిరిగి స్వదేశానికి వచ్చారని జైరాం రమేశ్ అన్నారు. ఈ ఒక్క ఎత్తుగడతో దేశం లేని ఆ ఆరు లక్షల మందికి మానవ హక్కులు, గౌరవం లభించాయని తెలిపారు. ఇదే సమయంలో భారత్, చైనా మధ్య కొన్నేళ్లు సరిహద్దు వివాదం నడించిందని మోదీకి చురకలంటించారు.

భారీ మెజార్టీతో గెలవబోతున్నాం

రాబోయేది కూటమి ప్రభుత్వమే

పిఠాపురంలో పవన్ కల్యాణ్

విశాలాంధ్రబ్యూరో-కాకినాడ: వైసీపీ రాక్షస పాలనను తరిమికొట్టడమే మన ముందున్న ఏకైక లక్ష్యమని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అందుకోసం రాబోయే 40 రోజులు మండల దీక్ష చేసినట్లుగా నిష్ఠగా పని చేద్దామన్నారు. ఆదివారం పిఠాపురం నియోజకవర్గం లోని మూడు పార్టీల నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమన్వయ సమావేశంలో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా పొత్తు కోసం తపించానని తెలిపారు. రాబోయేది కూటమి ప్రభుత్వమేనని... భారీ మెజార్టీతో సీట్లు గెలవబోతున్నామని ఆయన జోస్యం చెప్పారు. వైసీపీ రాక్షస పాలన నుంచి రాష్ట్రాన్ని బయట పడేయాలనే పొత్తులు పెట్టుకున్నట్లు వివరించారు. కేంద్రంలోని బీజేపీ పెద్దలు.. తమకు ఎంపీ స్థానాలు ఎక్కువ కావాలని కోరారని.. దీంతో జనసేన రెండు లోక్‌సభ స్థానాలకే పరిమితమైందని వివరించారు. బీజేపీ పెద్దల మనోభీష్టాన్ని కాదనకుండా ముందుకు వెళ్లామని ఆయన చెప్పుకొచ్చారు. 80 శాతం మంది పొత్తుకు అంగీకరించారని తెలిపారు. బీజేపీ, టీడీపీ బలమైన పునాదులు కలిగిన పార్టీలని చెప్పారు. అయితే సమూహాన్ని క్రమశిక్షణతో నడిపించే మెకానిజం ఇంకా జనసేన పార్టీ సంపాదించ లేదన్నారు. మనకు యువబలం, పోరాడేతత్వం మెండుగా ఉన్నాయని ఆయన తెలిపారు. వైసీపీ అకారణంగా చంద్రబాబుని జైల్లో పెట్టినప్పుడు బాధేసిందన్నారు. రాజమండ్రి వెళ్తున్నపుడు దారి పొడవునా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు తమ నాయకుడి కోసం పడిన తపన.. తనను కదిలించిందన్నారు. అందుకే రాజమండ్రి జైల్లో చంద్రబాబుని కలిసిన తరువాత తన వంతుగా ఏదైనా చేయాలి నిర్ణయించుకొన్నానన్నారు. వైసీపీ పాలనను తరిమికొట్టాలని ఈ సందర్భంగా ప్రజలకు పవన్ పిలుపు నిచ్చారు. వైసీపీ దోపిడీ అరికడితేనే సంక్షేమ పథకాలు అప్పులు లేకుండానే అమలు చేయవచ్చని ఆయన పునరుద్ఘాటించారు. వైసీపీ కుట్రలు, కుతంత్రాలను సమర్థంగా ఎదుర్కోవాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పోలింగ్ ముగిసే వరకు క్షేత్రస్థాయిలో కలిసి పనిచేయాలని కోరారు. టీడీపీ నేత వర్మ త్యాగం గొప్పదన్న పవన్.. ఆయన ఉన్నత స్థానంలో ఉండేలా చూస్తానని హామీ ఇచ్చారు. నా కోసం పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ తన సీటు త్యాగం చేసి నా గెలుపునకు సహకరిస్తాననడం శుభ పరిణామమన్నారు. 'చంద్రబాబు చెప్పారు నేను చేస్తా.. అని ఒకే మాట చెప్పారు. ఒంటరిగా పోరాడి గెలిచే దమ్మున్న నాయుడు వర్మ. కానీ, రాష్ట్రం బాగుపడాలని మంచి ఉద్దేశంతో ఆయన సీటు త్యాగం చేయడం శుభ పరిణామం. టీడీపీ, బీజేపీ హక్కులకు, రాజకీయ మనుగడకు ఇబ్బంది లేకుండా పనిచేస్తాం. జనసేన, టీడీపీ నాయకుల మధ్య ఏమైనా ఇబ్బందులు ఉంటే సర్దుకుపోవాలి. పిఠాపురంలో నా గెలుపు చరిత్రలో నిలిచిపోవాలి. ఆ బాధ్యత వర్మకు అప్పగిస్తున్నా' అని పవన్ అన్నారు.

ప్రతిపక్షాలపై మోదీ సర్కారు కక్ష సాధింపు

కేజ్రీవాల్ అరెస్టుపై విశాఖలో నిరసన : జేవీఎస్ మూర్తి

విశాలాంధ్ర-విశాఖ: ప్రతిపక్ష పార్టీలను అణగదొక్కేందుకు కేంద్రంలోని మోదీ సర్కారు కక్షపూరితంగా వ్యవహరిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా ఆమ్‌ఆద్మీ, సీపీఐ, సీపీఎం అధ్వర్యంలో ఆదివారం దాబా గార్డెన్స్ అంబేద్కర్ విగ్రహం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించి, గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేవీఎస్ మూర్తి మాట్లాడుతూ ఎన్నికల బాండ్ల అంశం బయటకు రాగానే దాని నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని విమర్శించారు. కేజ్రీవాల్ కేబినెట్‌లోని మంత్రులకు నోటీసులు ఇచ్చారని, అంతకుముందు మనీశ్ సిసోడియాని అరెస్టు చేసి ఏడాది పాటు జైలులో ఉంచారన్నారు. ఇంతకుముందు జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌ను కూడా ఈడీ అరెస్టు చేసిందని చెప్పారు. కాంగ్రెస్, సీపీఎం, సీపీఎంలకు ఐటీ నోటీసులు జారీ చేయడం ద్వారా ఆ పార్టీలను ఇబ్బందులకు గురి చేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కేజ్రీవాల్, హేమంత్ సోరెన్‌ల అరెస్టులకు నిరసనగా ఆదివారం ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. ఎన్నికల బాండ్ల ద్వారా బీజేపీకే పెద్ద మొత్తంలో నిధులు సమకూరాయని, దానిపై ఆ పార్టీ ఎందుకు సమాధానం ఎందుకు చెప్పదని ప్రశ్నించారు. పదేళ్ల కాలంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. నిరుద్యోగం పెరిగిందని, ధరలు ఆకాశానికి ఎగబాకాయని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని, దానికి వత్తాసు పలుకుతున్న ఎన్డీఏ పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. బీజేపీ దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా ప్రజలు గళం విప్పాల న్నారు. ప్రజల్లో ప్రతిపక్ష ఇండియా కూటమికి ఆదరణ పెరగడంపై బీజేపీలో ఆందోళన మొదలైందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఆప్ రాష్ట్ర నేతలు రమేశ్, డాక్టర్ సీతాల్, కాంగ్రెస్ నేత ఎస్.సుధాకర్, సీపీఎం నేత కృష్ణారావు, భారత్ బచావో నేతలు వేమన, శ్రీనివాస్, సీతామహాలక్ష్మీ, పీఓడబ్ల్యు లక్ష్మీ, లలిత, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల బాధలు తీర్చేలా పథకాలు

యూపీ ఎన్నికల ప్రచారంలో మోదీ డాంబికాలు

మీరట్: రాబోయే ఎన్నికలు ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం కోసం కాదని 'వికసిత్ భారత్' కోసమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 'గత 10 ఏళ్లలో అవినీతికి వ్యతిరేకంగా మేం తీసుకున్న చర్యల్ని దేశం మొత్తం చూసింది. పేదల సొమ్మును దోచుకోకుండా మేం భరోసా ఇచ్చాం. అందుకే అవినీతిపరులు ఈ రోజు కటకటాల వెనుక ఉన్నారు" అని సుద్దులు పలికారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్‌లో ప్రధాని ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాబోయే ఎన్నికలు అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్న ఎన్డీయేకు అవినీతిపరులను కాపాడే ప్రతిపక్షానికి మధ్య జరుగుతున్న ఎన్నికలని చెప్పారు. గత పదేళ్లలో ట్రైలర్ మాత్రమే చూశారని, అసలు అభివృద్ధి ముందుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. రానున్న ఐదేళ్లలో దేశాన్ని మరింత ప్రగతి పథంలో నడిపించేందుకు బీజేపీ రోడ్‌మ్యాప్ సిద్ధం చేసిందనీ, మొదటి 100 రోజుల్లో మనం ఎలాంటి ప్రధాన నిర్ణయాలు తీసుకోవాలనే దానిపై వేగంగా పని జరుగుతోందని చెప్పారు. ముచ్చటగా మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినప్పుడే పేదరిక నిర్మూలన సాధ్యపడుతుందని, మధ్య తరగతి ప్రజలకు బలం చేకూరుతుందని చెప్పారు. అవినీతికి వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటున్నందుకు ప్రభుత్వంపై కొందరు గుర్రుగా ఉన్నారని చెప్పుకున్నారు. అవినీతిపై పోరాడుతున్నందునే చాలా మంది అవినీతిపరులు కటకటాల వెనుక ఉన్నారన్నారు. ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలకు వెనకాడే ప్రసక్తే లేదని మోదీ పునరుద్ఘాటించారు. రైతులను చిన్నచూపు చూసే ఇండియా కూటమి పార్టీలు... చౌదరి చరణ్ సింగ్ లాంటి నేతలకు తగిన గుర్తింపు ఇవ్వలేదని విమర్శించారు. పేదరికంలో పుట్టి, పెరిగిన తనకు ఆ బాధ ఎలా ఉంటుందో తెలుసని, అందుకే ఎవరూ పేదరికంతో బాధపడకుండా ప్రతి ఒక్కరికీ పథకాలు చేరువయ్యేలా చర్యలు తీసుకుంటున్నానని చెప్పారు. పేదల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు బీజేపీ కృషి చేస్తుందన్నారు. తాజా ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మోదీ పిలుపునిచ్చారు. మీరట్ విప్లవాల గడ్డ అని, విప్లవకారులకు పుట్టినిల్లని అన్నారు. చౌదరి చరణ్‌సింగ్ లాంటి ఎందరో నాయకులను దేశానికి అందించిన మహిమాన్వితమైన నేల అని కొనియాడారు.

కాంగ్రెస్‌కు మరో ఐటీ నోటీసు?

- మొత్తం రూ.3,567 కోట్లు కట్టాలన్న ఐటీశాఖ!

- వెల్లడించిన పార్టీ వర్గాలు

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల ముందు కేంద్రంలోని మోదీ సర్కారు కాంగ్రెస్ పార్టీపై వేధింపులకు పాల్పడుతోంది. రెండు రోజులక్రితం రూ.1,823 కోట్లు చెల్లించాలని ఆ పార్టీకి నోటీసులు పంపిన ఆదాయపన్ను శాఖ తాజాగా మరో రూ. 1,745కోట్లు కట్టాలని హుకుం జారీ చేసింది. 2014-15 నుంచి 2016-17 సంవత్సరాలకు సంబంధించి రూ.1,745 కోట్లు కట్టాలని ఆదాయ పన్ను శాఖ నోటీసులు ఇచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఆదాయ పన్ను శాఖ జారీ చేసిన రెండు నోటీసుల ప్రకారం కాంగ్రెస్ పార్టీ మొత్తం రూ. 3,567 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. 2014-15 సంవత్సరానికి రూ. 663 కోట్లు, 2015-16కు రూ.664 కోట్లు, 2016-17కు రూ. 417 కోట్లు అని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. రాజకీయ పార్టీలకు ఇచ్చే పన్ను మినహాయింపు ముగిసినందున ఆ పార్టీకి చెందిన మొత్తం ఆదాయంపై పన్ను విధించినట్లు తెలిపాయి. 2017-18 నుంచి 2020-21 మదింపు సంవత్సరాలకు సంబంధించి పెనాల్టీ, వడ్డీలతో కలిపి మొత్తం రూ.1,823 కోట్లకు పైగా చెల్లించాలని ఐటీ విభాగం శుక్రవారం కాంగ్రెస్‌కు నోటీసులు జారీ చేసింది. 2017 - 2021 మధ్య కాలానికి ఆదాయపు పన్ను విభాగం చేపట్టిన పునఃపరిశీలనను నిలిపేయాలన్న కాంగ్రెస్ పిటిషన్లను గురువారం ఢిల్లీ హైకోర్టు కొట్టేసిన మరోసటి రోజే ఈ నోటీసులు ఇచ్చారు. కాగా, మదింపు ప్రక్రియ చేపట్టేందుకు అవసరమైన ఆధారాలు ఐటీ అధికారుల దగ్గర ఉన్నాయని, ఈ విషయంలో జోక్యం చేసుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. అంతకుముందు 2014-15 నుంచి 2016-17 మధ్య కాలానికి సంబంధించి ఐటీశాఖ పునఃపరిశీలనను సవాల్ చేస్తూ కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా ఇవే కారణాలతో ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. 2014-15 నుంచి 2016-17 పునఃపరిశీలనకు సంబంధించి రూ.200 కోట్లు చెల్లించాలని కాంగ్రెస్‌కు ఐటీ విభాగం స్పష్టం చేసింది. కాంగ్రెస్ బ్యాంకు ఖాతాల నుంచి రూ.135 కోట్లను రికవరీ చేసింది. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికలకు ముందు తాము తీవ్ర నిధుల కొరతను ఎదుర్కొంటున్నామని కాంగ్రెస్ హైకోర్టును ఆశ్రయించింది. అందుకు న్యాయస్థానం తిరస్కరించిన వెంటనే ఐటీ విభాగం కొత్త నోటీసులను జారీ చేసింది. ఈ విషయంపై కాంగ్రెస్ సుప్రీం కోర్టును సోమవారం ఆశ్రయించవచ్చని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

అద్వాణీకి 'భారత రత్న' ప్రదానం

ఇంటికి వెళ్లి అందించిన రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ: రాజకీయ కురువృద్ధుడు, భారత మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వాణీకి భారత అత్యున్నత పౌర పౌరపురస్కారం భారతరత్న పురస్కారాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రదానం చేశారు. అనారోగ్య కారణాల దృష్ట్యా ఈ అవార్డును ఆయన నివాసంలోనే ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రపతితో పాటు ప్రధాని మోదీ, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తదితరులు హాజరయ్యారు. రాష్ట్రపతి అద్వాణీని భారతరత్నతో సత్కరిస్తున్నప్పుడు ప్రధాని మోదీ పక్కనే కూర్చున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది భారత రత్న కోసం ఐదుగురు పేర్లను ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా శనివారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వం భారత రత్న అవార్డులను ప్రదానం చేసింది. కానీ అనారోగ్య సమస్యల కారణంగా అద్వాణీ హాజరు కాలేకపోయారు. అందుకే... ఆయన ఇంటికి వెళ్లి మరీ భారత రత్న పురస్కారాన్ని అందజేశారు ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ. ఎల్కే అద్వాణీ రాజకీయాల్లో ఏడు దశాబ్దలపైగా కీలకంగా పని చేసి దేశానికి సేవలందించారని రాష్ట్రపతి పేర్కొన్నారు. '1927లో కరాచీ (ప్రస్తుతం పాక్‌లో ఉంది) జన్మించిన ఆయన 1947 దేశ విభజన సమయంలో భారత్‌కు వలస వచ్చారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడవేసినప్పుడు దాని నుంచి రక్షించడంలో కీలకంగా వ్యవహరించారు' అని 'ఎక్స్' వేదికగా తెలిపారు. భారత రాజకీయాలలో ప్రముఖుడు, అద్వాణీ ఏడు దశాబ్దాలకు పైగా అచంచలమైన అంకితభావం, ప్రత్యేకతతో దేశానికి సేవలందించారని... పార్లమెంటేరియన్‌గా చర్చలకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యత పార్లమెంటరీ సంప్రదాయాలను సుసంపన్నం చేసిందని రాష్ట్రపతి భవన్ పేర్కొంది. హోంమంత్రిగా, ఉప ప్రధాన మంత్రిగా అద్వాణీ ఎల్లప్పుడూ జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపింది. 'అద్వాణీకి భారతరత్న ప్రదానం చేయడం చాలా ప్రత్యేకమైనదని, ఈ గౌరవం దేశ ప్రగతికి ఆయన చేసిన నిరంతర సేవలకు గుర్తింపు' అని 'ఎక్స్' వేదిక ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. 'ప్రజాసేవ పట్ల ఆయనకున్న అంకితభావం ,ఆధునిక భారతదేశాన్ని రూపొందించడంలో ఆయన కీలక పాత్ర మన చరిత్రలో చెరగని ముద్ర వేసింది. గత కొన్ని దశాబ్దాలుగా ఆయనతో చాలా సన్నిహితంగా పనిచేసే అవకాశం లభించినందుకు గర్వపడుతున్నాను' మోదీ అన్నారు. 1977-1979 వరకు అద్వాణీ కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రిగా పనిచేశారు. 1999 నుంచి 2004 వరకు హెూంమంత్రిగా, 2002 నుంచి 2004 వరకు దేశ ఉప ప్రధానిగా పని చేశారు. 1986 - 1990, 1993- 1998, 2004 నుంచి 2005 వరకు బీజేపీ అధ్యక్షుడిగా ఉన్నారు.

నేటి నుంచి ఎన్‌పీఎస్ లాగిన్, క్రెడిట్ కార్డుల్లో మార్పులు

న్యూఢిల్లీ: ఏప్రిల్ ఒకటి నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కాబోతోంది. కొన్ని ఆర్థిక సంబంధమైన మార్పులు కూడా చోటుచేసుకోబోతున్నాయి. ఎన్‌పీఎస్ లాగిన్, క్రెడిట్ కార్డు రివార్డుల విషయంలో మార్పులు రాబోతున్నాయి. ఆ వివరాలు...

లాగిన్ రూల్: ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ఎన్‌పీఎస్ (నెట్ ప్రమోటర్ స్కోర్) ఖాతా లాగిన్‌కు సంబంధించి పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ కీలక నిర్ణయం తీసుకుంది. భద్రతను మరింత మెరుగు పరుస్తూ రెండు ఫ్యాక్టర్ ఆధార్ బేస్డ్ అథంటికేషన్ వ్యవస్థను తీసుకొచ్చింది. పాస్‌వర్డ్ ఆధారిత యూజర్లందరూ ఏప్రిల్ ఒకటి నుంచి ఈ విధానాన్నే అనుసరించాల్సి ఉంటుంది. మార్చి 15న ఈ మేరకు ఓ సర్క్యులర్ జారీ చేసింది.

ఎస్‌బీఐ డెబిట్ కార్డు ఛార్జీలు: డెబిట్ కార్డులపై నిర్వహణ ఛార్జీలను ఎస్‌బీఐ సవరించింది. ఏప్రిల్ ఒకటి నుంచి కొత్త ఛార్జీలు అమల్లోకి రానున్నాయి. క్లాసిక్ డెబిట్ కార్డులు, సిల్వర్, గ్లోబల్, కాంటాక్ట్‌లెస్ డెబిట్ కార్డులపై వార్షిక నిర్వహణ రుసుములను రూ.125 నుంచి రూ.200కు పెంచింది. యువ, గోల్డ్, కాంబో డెబిట్ కార్డు, మై కార్డ్‌ల నిర్వహణ ఛార్జీలను రూ.175 నుంచి రూ.250కి చేర్చింది. ప్లాటినం డెబిట్ కార్డుల విభాగంలోని ఎస్‌బీఐ ప్లాటినం డెబిట్ కార్డు ఛార్జీని రూ.250 నుంచి రూ.325కు పెంచింది. ప్లాటినం బిజినెస్ కార్డు ఛార్జీలు రూ.350 నుంచి రూ.425కు పెరిగాయి. ఈ ఛార్జీలపై జీఎస్టీ అదనం.

క్రెడిట్ కార్డు రూల్స్: ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్ రివార్డ్ పాయింట్ల విధానాల్లో మార్పు చేసింది. ఇప్పటివరకు అద్దె చెల్లింపులపై రివార్డ్ పాయింట్లను అందిస్తున్న బ్యాంక్... ఏప్రిల్ ఒకటి నుంచి ఆ తరహా రివార్డులను నిలిపివేయనుంది. ఎస్‌బీఐ అందిస్తున్న కార్డ్ ఎలైట్, సింప్లీ క్లిక్ కార్డులు వినియోగిస్తున్న వారిపై ఈ ప్రభావం ఉండనుంది. కాంప్లిమెంటరీ ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్ నిబంధనలను ఐసీఐసీఐ బ్యాంక్ సవరించింది. ఒకటో తేదీ నుంచి కొత్త రూల్స్ అమల్లోకి రానున్నాయి. రాబోయే త్రైమాసికంలో ఈ సదుపాయం పొందాలంటే మునుపటి త్రైమాసికంలో కార్డ్ ద్వారా కనీసం రూ.35,000 ఖర్చు చేయాల్సి ఉంటుంది. కోరల్ క్రెడిట్ కార్డ్, మేక్ మై ట్రిప్ ఐసీఐసీఐ బ్యాంక్ ప్లాటినం క్రెడిట్ కార్డ్ సహా వివిధ రకాల కార్డులకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. యెస్ బ్యాంక్ కూడా లాంజ్ యాక్సెస్‌లో నిబంధనలను సవరించింది. ఏ త్రైమాసికంలో లాంజ్ సదుపాయం పొందాలన్నా అంతకు మునుపటి త్రైమాసికంలో కార్డ్ ద్వారా కనీసం రూ.10,000 వెచ్చించాల్సి ఉంటుందని పేర్కొంది. యాక్సిస్ బ్యాంక్ అందిస్తున్న మాగ్నస్ క్రెడిట్ కార్డ్‌పై రివార్డ్ పాయింట్లు, లాంజ్ యాక్సెస్‌తో పాటు వార్షిక రుసుముల్లో కీలక మార్పుల్ని తీసుకొచ్చింది. బీమా, గోల్డ్/ఆభరణాలు, ఇంధనం కోసం క్రెడిట్ కార్డ్ ద్వారా జరిపే చెల్లింపులపై ఇక నుంచి ఎలాంటి రివార్డ్ పాయింట్లు ఇవ్వబోమని స్పష్టంచేసింది. ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్ పొందాలంటే మూడు నెలల్లో కనీసం రూ.50,000 ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఒక క్యాలెండర్ సంవత్సరంలో దేశీయ, అంతర్జాతీయ లాంజ్‌ల్లోకి కాంప్లిమెంటరీ గెస్ట్ సందర్శనల సంఖ్యను కూడా ఏడాదికి ఎనిమిది నుంచి నాలుగుకు తగ్గించనుంది. ఏప్రిల్ 20 నుంచి కొత్త మార్పులు అమల్లోకి వస్తాయి.

బీమా...: బీమా పాలసీలను డిజిటలైజేషన్ చేయడాన్ని తప్పనిసరి చేసింది. అంటే ఇకపై నుంచి అన్ని బీమా సంస్థలూ ఎలక్ట్రానిక్ పద్ధతిలో పాలసీలను అందించాల్సి ఉంటుంది. జీవిత, ఆరోగ్య, సాధారణ బీమా సహా అన్ని బీమా పాలసీలకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. ఏప్రిల్ ఒకటి నుంచి ఈ నిబంధనలు అమల్లోకి రానున్నాయి.

యూపీలో కాంగ్రెస్‌కు 40 మంది స్టార్ క్యాంపెయినర్లు

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి 40మంది స్టార్ క్యాంపెయినర్లను కాంగ్రెస్ ఆదివారం విడుదల చేసింది. అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సీనియర్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు యూపీ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ రాయ్, ప్రధాన కార్యదర్శి ఇన్‌చార్జి అవినాశ్ పాండే, కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారు. సీనియర్ నేతలు సల్మాన్ ఖుర్షీద్, మీరా కుమార్, అశోక్ గెహ్లోత్, దిగ్విజయ్ సింగ్, భూపేశ్ బాఘెల్, హరీశ్ రావత్, సచిన్ పైలట్ పేర్లు ఈ జాబితాలో చోటుచేసుకున్నారు.ఇదిలావుంటే ఏప్రిల్ 5న మేనిఫెస్టోను విడుదల చేస్తున్నట్టు కాంగ్రెస్ ప్రకటించింది. కాగా, 80 లోక్‌సభ స్థానాలున్న ఉత్తరప్రదేశ్‌లో లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 19తో ప్రారంభమై జూన్ 1 వరకూ ఏడు విడతల్లో జరుగనున్నాయి.

సుప్రీం తీర్పునకు ముందే 10 వేల బాండ్ల ముద్రణకు అనుమతి

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని ఫిబ్రవరి 15న సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. అయితే... అంతకు మూడు రోజుల క్రితమే 10 వేల ఎలక్టోరల్ బాండ్ల ముద్రణకు సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎస్‌పీఎంసీఐఎల్)కు ఆర్థిక శాఖ పచ్చజెండా ఊపినట్లు సమాచారం. ఆ బాండ్ల విలువ ఒక్కోటి రూ.కోటి ఉన్నట్లు ఆర్టీఐ వివరాల్లో ఉందని ఓ వార్తాసంస్థ తెలిపింది. సుప్రీం తీర్పు అనంతరం ఆ బాండ్ల ముద్రణను నిలిపేయాలంటూ ఫిబ్రవరి 28న ఆర్థికశాఖ మరోసారి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఎస్‌పీఎంసీఐఎల్ అప్పటికే 8,350 బాండ్లను ముద్రించి ఎస్‌బీఐకి చేర వేసినట్లు వెల్లడైంది. ఆర్థిక శాఖ, ఎస్‌బీఐల మధ్య ఈ-మెయిల్ వంటి సంప్రదింపుల వివరాల ద్వారా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు వార్తాసంస్థ పేర్కొంది.

టైమ్స్ నౌ మేనేజింగ్ ఎడిటర్

వినీత్ జైన్‌కు జీవిత సాఫల్య పురస్కారం

న్యూఢిల్లీ: టైమ్స్ నౌ మేనేజింగ్ ఎడిటర్ వినీత్ జైన్‌కు జీవిత సాఫల్య పురస్కారం లభించింది. టీవీ న్యూస్ రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా ఎక్స్ఛేంజ్ ఫర్ మీడియా న్యూస్ బ్రాడ్‌కాస్టింగ్ అవార్డ్స్ (ఈఎన్‌బీఏ) ఈ పురస్కారాన్ని అందజేసింది. తనకు అవార్డు రావడంపై వినీత్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ అవార్డును టైమ్స్ గ్రూప్ ఉద్యోగులకు, తన సోదరుడు సమీర్ జైన్‌కు అంకితం ఇస్తున్నట్లు ప్రకటించారు. మీడియా స్వేచ్ఛగా పని చేయాలని... బలంగా, స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా ఉండాలని నమ్ముతానని చెప్పారు. మీడియా పరిశ్రమను, సంస్థలను బలోపేతం చేయడానికి అంకితభావంతో పని చేస్తానన్నారు. టైమ్స్ గ్రూప్ విస్తరణలో వినీత్ జైన్ కీలక పాత్ర పోషించారు. న్యూస్ పేపర్, మ్యాగజైన్‌గా ఉన్న టైమ్స్ ఆఫ్ ఇండియాను ఇతర విభాగాల్లోకి విస్తరించారు. రేడియో మిర్చీ (ఎఫ్ఎం రేడియో), టైమ్స్ ఇంటర్నెట్ (ఇంటర్నెట్), టైమ్స్ నెట్‌వర్క్ (టీవీ)లను ఆయా రంగాల్లో దేశంలోకెల్లా అతిపెద్ద కంపెనీలుగా తీర్చిదిద్దారు. టైమ్స్ మ్యూజిక్, ఫిల్మ్స్ (జంగ్లీ పిక్చర్స్), ఈవెంట్స్ (టీఎస్ఎస్ఎల్), ఔట్ డోర్ మీడియా (టైమ్స్ ఓఓహెచ్), మ్యాజిక్ (బ్రిక్స్ మొదలైనవి.. తమ తమ రంగాల్లో సత్తా చాటడంలో వినీత్ జైన్ కృషి ఎంతో ఉంది. చీఫ్ కంటెంట్ ఆర్కిటెక్ట్‌గా దశాబ్దాల పాటు పని చేసిన వినీత్ జైన్ మీడియాలోని ప్రతి విభాగంలో నంబర్ వన్ బ్రాండ్లుగా టైమ్స్ గ్రూప్ సంస్థలను తీర్చిదిద్దారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.